
# రాబిన్ సన్ క్రూసో

## డేనియల్ డెఫో



# రాబిన్ సన్ క్రూసో

డేనియల్ డెఫో

# రాబిన్ సన్ క్రూసో

## అధ్యాయము - 1

ఉత్తర ఇంగ్లండ్ దేశంలో యార్క్ అనే పట్నం ఒకటి ఉంది. ఆ పట్నంలో ఒక వ్యాపారస్తుడు ఉండేవాడు. అతడు చాలా ధనవంతుడు. అతనికి ముగ్గురు కొడుకులు. వారిలో చివరివాడు రాబిన్ సన్ క్రూసో.

1632వ సంవత్సరంలో రాబిన్ సన్ క్రూసో పుట్టాడు. అతడు చిన్నప్పటి నుండీ ధైర్యవంతుడు. వీరుల కథలను ఎక్కువగా చదువుతూ ఉండేవాడు. అందువల్ల అతడు పెరిగి పెద్ద వాడు అవుతున్న కొద్దీ వీరోచితమైన జీవితాన్ని గడపాలని అనుకొంటూ ఉండేవాడు.

అతని తండ్రి అతనికి బాగా చదువుచెప్పిస్తూ వచ్చాడు. క్రూసో బాగా చదువుకొని గొప్ప న్యాయవాది కావాలని అతని తల్లి తండ్రులు ఆశిస్తూ ఉండేవారు. కాని ఆ వృత్తి అంటే క్రూసోకు ఇష్టం లేదు. నావికుడుగా సముద్ర యానం చేయాలనీ, అనేక దేశాలు చూసి రావాలనీ క్రూసో కోరుకుంటూ ఉండేవాడు. అతని శ్రేయస్సు కోరి అతని తల్లిదండ్రులూ, బంధువులూ, స్నేహితులూ అతన్ని నావికుడుగా వెళ్ళవద్దని ఎంత నచ్చచెప్పినా అతని మనస్సు మారలేదు. కాని అతని తండ్రి గట్టిగా మందలించడంతో క్రూసో తన కోరికను మనసులో అణుచుకొనక తప్పలేదు.

అతని తండ్రి స్నేహితులలో ఒక ఓడ కెప్టెన్ కూడా ఉన్నాడు. అతడు ఒకనాడు వారి ఇంటికి వచ్చాడు. అతనితోపాటు క్రూసో ఈడు వాడే ఐన అతని కొడుకు కూడా వచ్చాడు.ఇద్దరూ ఒకే ఈడు వాళ్ళు అవటంతో వెంటనే స్నేహం యేర్పడింది. వారిద్దరూ కలిసి కబుర్లు చెప్పుకోవడం మొదలుపెట్టారు.

ఆ కొత్త స్నేహితుడు అతని తండ్రితోగూడా తరచుగా ఓడ మీద సముద్రయానం చేస్తూ అనేక దేశాలు చూసి వచ్చాడు. ఆయా దేశాలలోని వింతలను విశేషాలను అతడు క్రూసోకు ఆనాడు వివరంగా చెప్పాడు. దాంతో క్రూసో మనసు మళ్ళీ నౌకాయానం మీదకు మళ్ళింది. అతనిలోని పాత కోరిక మళ్ళీ రేకెత్తింది.

"సముద్రయానం చేసి వివిధ దేశాలలోని వింతలూ, విశేషాలు చూసి రావాలని నాకు యెంతో సరదాగా ఉంది. నావికునిగా నా జీవితాన్ని గడపాలని ఉంది" అంటూ క్రూసో తన మనస్సులోని కోరికను ఆ కొత్త స్నేహితునికి తెలియజేశాడు.

"దానికేముంది? వచ్చే శనివారం మేం హల్ రేవు నుండి బయలుదేరి ఓడలో లండన్ వెళ్తున్నాం. నీకు సరదాగా ఉంటే మాతో రా. నీకు ఏ కర్చులేకుండా నేను తీసికొనివెళ్తాను," అన్నాడు ఆ కొత్త స్నేహితుడు.

"నాకు రావాలనే ఉంది. కాని మా నాన్నగారికి ఇష్టం లేదు"

"యేం?"

"నావికుడు తన ప్రాణాలను యెప్పుడూ అరచేతిలో పెట్టుకొని ఉండవలసి ఉంటుందని ఆయన భయం."

"సముద్రయానంలో ప్రమాదాలు ఉన్నాయనుకో ! అప్పుడప్పుడు మనం తుఫానులను యెదుర్కోవలసి ఉంటుంది. కాని అవి యెప్పుడోగాని రావు. ప్రతి వృత్తిలోను మంచీ, చెడూ రెండూ ఉంటాయి.సముద్రయానం చేసే నావికులకు తుఫానులను యెదుర్కొనే ధైర్యసాహసాలు ఉండాలి. అప్పుడే వారి జీవితాలు సంతోషదాయకంగా ఉంటాయి. వివిధ దేశాలను, రకరకాల మనుష్యులను అనేక

వింతలను చూసే అదృష్టం ఒక్క నావికులకే కలుగుతూ ఉంటుంది. అందరికీ ఈ అదృష్టం ఉండదు. మీ నాన్నగారు ఆశించినట్టుగా నీవు ఒక న్యాయవాదివి అయితే ఈ ఊళ్ళోనే ఉంటూ నీ జీవితమంతా ఒకే విధంగా గడపవలసి ఉంటుంది."

నాకు చిన్నపటినుంచి నావికుని జీవితమంటేనే సరదా. తుఫానులంటే నాకు భయం లేదు. పెనుగాలులు వీస్తూ ఉవ్వెత్తున కెరటాలు లేచిపడుతున్నప్పుడు సముద్రంలో ఓడ ఉయ్యాలలాగా ఊగిసలాడుతూ ఉంటే ఎంతో సరదాగా ఉంటుంది కదూ?" అన్నాడు క్రూసో సముద్రయానంలో తుఫానును ఊహించుకొంటూ.

"అల్లకల్లోలంగా ఇండే సముంద్రంలో ఓడ ప్రయాణం సరదాగా ఉండదు. చాలా భయంకరంగా ఉంటుంది. కాని దానివల్ల నీకు ధైర్యసాహసాలు అబ్బుతాయి," అన్నాడు స్నేహితుడు.

"నన్ను సముద్రయానానికి పంపమని మా నాన్నగారిని చివరిసారిగా అడుగుతాను. ఆయన సమ్మతిస్తే సరే సరి, లేకపోతే ఎవరితోను చెప్పకుండా వచ్చి మిమ్మల్ని హల్ రేవువద్ద వచ్చే శనివారం కలిసికొంటాను." అని క్రూసో తన నిశ్చయాన్ని తన స్నేహితునికి తెలియజేశాడు.

"తప్పకుండా కలిసికో" అన్నాడు ఆ కొత్త స్నేహితుడు, క్రూసో చేయబోయే పని తప్పని తెలియక.

అతిథిగా వచ్చిన ఓడ కెప్టెన్ తనకొడుకును తీసికొని వెళ్ళిన తర్వాత క్రూసో తన తండ్రివద్దకు వెళ్ళి తనను సముద్రయానానికి పంపమని బ్రతిమలాడాడు.

"నీవు న్యాయవాదివి అయితే నీవు నీ జీవితాన్ని హాయిగా గడపవచ్చును. నీకు పేరు ప్రతిష్టలు వస్తాయి. నీవు నా మాట విని ఇంటి పట్టున ఉంటే నీకు యేది

కావాలంటే అది ఇస్తాను. సముద్రయానమంటే నీవు యేదో ఊహించుకొని సరదా పడుతున్నావే కాని అందులో ఉండే ప్రమాదాలను నీవు గుర్తించడంలేదు. నా మాట విని ఆ జీవితం గురించి మరచిపో. పెద్దవాళ్ళ మాట వినడం నీకు ఎంతో మంచిది. వినకపోతే ఆ తప్పుకు తగిన శిక్ష నీవే అనుభవిస్తావు" అంటూ క్రూసో తండ్రి అతన్ని నయాన్నా భయాన్నా మందలించాడు.

కాని క్రూసో బుద్ధి మారలేదు. అందువల్ల అతడు ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచిపెట్టి బయలుదేరాడు. శనివారం నాటికి అతడు హల్ రేవు చేరుకొని అతని స్నేహితుని కలిసికొన్నాడు. ఇంటినుండి పరారీ అయిననాటికి రాబిన్ సన్ క్రూసో మరీ చిన్న వాడేం కాదు. ఆ నాటికి అతని వయస్సు ఇరవై సంవత్సరాలు.

## అధ్యాయము - 2

హల్ రేవువద్ద ఓడ ప్రయాణానికి సిద్ధంగా ఉంది. రాబిన్సన్ క్రూసోను చూడగానే సంతోషంతో స్వాగతం పలికాడు కెప్టెన్ కొడుకు. తండ్రి అనుమతితోనే క్రూసో వచ్చిఉంటాడన్న ఉద్దేశ్యంతో అతన్ని ఆదరంతో ఆహ్వానించాడు ఓడ కెప్టెన్.

ఓడలోని వివిధ భాగాలను వివరించి క్రూసోకు అతని స్నేహితుడు చూపించాడు. వాటిని ఎంతో కుతూహలంతో వింతగా చూశాడు క్రూసో.

1651 సెప్టెంబర్ 1వ తేదీన ఓడ హల్ రేవునుండి బయలుదేరింది. ఆనాడు సముద్రం ఉధృతంగా లేదు. ప్రశాంతంగా ఉంది. వాతావరణం ఎంతో హాయిగా ఉంది. గాలివాటుగా తెరచాప సహాయంతో ఓడ యార్ మౌత్ రేవు దిక్కుగా ప్రయాణం సాగించింది.

క్రూసోకు ఇది తొలి సముద్రయానం. అందువల్ల ఉప్పు గాలి పడక, అతడు వాంతులు చేసికొని రెండు రోజులు పడక యెక్కాడు. దాంతో అతని దృష్టి

ఇంటిమీదికి మరలింది. కాని అతని ఆరోగ్యం కుదుటపడడంతో అతను ఇంటి విషయం మరచి పోయాడు.

ఆరు రోజుల అనంతరం ఓడ యార్ మౌత్ రేవును సమీపించింది. కాని ఆనాడు సముద్రం అల్లకల్లోలంగా ఉండడంవల్ల రేవు దూరంగా ఓడకు లంగరు వేయవలసివచ్చింది. నావికులు చిన్నపడవలను ఎక్కి రేవుకు దూరంగా తీరాన్ని చేరుకొని తర్వాత కాలినడకని ఆ పట్నం చేరుకొన్నారు.

కొన్ని కష్టాలను ఎదుర్కొన్నా మొత్తం మీద క్రూసోకు అతని తొలి సముద్రయానం సంతోషాన్నే కలిగించింది. నావికుని జీవితం అతనికి ఎంతో నచ్చింది. కనుక అతడు ఇంటికి తిరిగి వెళ్ళ దలచుకొనలేదు.

యార్ మౌత్ రేవు వద్ద ఓడ కెప్టెన్ తన అనుచరుల్ని దయతోచూసి వారికి కొత్త బట్టల జతలు, కొంత డబ్బూ ఇచ్చాడు. ఇంకా ముందుకు ప్రయాణం చేయదల్చుకొన్నవారు తనతో లండన్ రావచ్చునని, ఇష్టం లేని వారు తిరిగి వెనుకకు వెళ్ళిపోవచ్చునని అతడు చెప్పాడు.

ఆనాడు క్రూసో తిరిగి ఇంటికి వెళ్ళదలుచుకొని ఉంటే అతని కథ ఇంకో విధంగా ఉండేది. కాని అతని మనస్సు సముద్రయానానికే పురిగొల్పింది. అందువల్ల అతడు ఆ ఓడలో అక్కడనుంచి లండన్ వెళ్ళాడు. అక్కడ కొన్నాళ్ళు ఉండి ఆ మహా నగరాన్ని చూడదలిచాడు. ఆ ఓడ తర్వాత ముందుకు సాగిపోయింది.

లండన్ నగరంలో క్రూసో కొన్నాళ్ళు ఉండడంతో అతనికి కొంతమంది మంచి స్నేహితులు దొరికారు. వారిలో ఒకడు ఒక వాణిజ్య నౌకకు కెప్టెన్. అతడు తరచుగా వ్యాపారంకోసం గినియా దేశం వెళ్ళి వస్తూ ఉండేవాడు. గినియా దేశానికి యేదైన సరుకు తీసికొని వెళ్ళి లాభసాటిబేరం చేయమని అతడు క్రూసోకు సలహా ఇచ్చాడు.

క్రూసోకు ప్రయాణపు కర్చులు, కేవు కర్చులూ యేవీ లేకుండా సహాయం చేయడానికి ఆ కెప్టెన్ అంగీకరించాడు. అందుకు క్రూసో యెంతో సంతోషించి ఆటబొమ్మలను గినియా దేశం తీసికొని వెళ్ళి, అక్కడ అమ్మి, ఆ డబ్బుతో అక్కడ బంగారపు పొడినికొని లండన్లో అమ్మడం ప్రారంభించాడు. ఆ విధంగా అతడు ఒక వ్యాపారస్తుడై లండన్లో మూడు సంవత్సరాలు ఉన్నాడు.

ఆ మూడు సంవత్సరాలలో అతడు వ్యాపారరీత్యా నౌకా యానం చేస్తూ వివిధ దేశాలను సందర్శించాడు. ఆ యా దేశాలలో అనేక వింతలను, విశేషాలను చూశాడు. రకరకాలైన మనుష్యులు అతనికి తారసిల్లేరు. కొన్ని దేశాలలోని మనుష్యులు నల్లగా ఉన్నారు. కొన్ని దేశాలలోని ప్రజలు అర్ధనగ్నంగా ఉన్నారు. కొన్ని దేశాలలోని మనుష్యులు కొందరు తోటి మానవులను చంపి తింటారని క్రూసో విన్నాడు.

ఒకసారి క్రూసో వ్యాపార నిమిత్తం ఒక వాణిజ్య నౌకలో వెళ్తూ ఉండగా టర్కీ దేశపు ఓడ దొంగలు వీరి నౌకను ముట్టడించి కొంతమందిని చంపివేశారు. కొంతమందిని బంధించి తీసికొని పోయారు. అప్పుడు క్రూసో ఆ దొంగల నాయకునికి బానిస అయ్యాడు. బానిసగా క్రూసో ఆ దొంగల నాయకుని ఇంట్లో ఊడిగపు పనులు చేయవలసి వచ్చింది. ఆ సమయంలో అతనికి తల్లి తండ్రీ గుర్తుకు వచ్చారు.

ఆ దొంగల నాయకుని ఓడను అప్పుడప్పుడు క్రూసో కాపలాకాయవలసి వచ్చేది. ఆ ఓడలోనే కొన్నాళ్ళపాటు అతడు ఉండిపోవలసి వచ్చేది. అతడు చిన్నప్పుడు అల్లారుముద్దుగా పెరిగాడు. తర్వాత స్వేచ్ఛగా బ్రతికాడు. అందువల్ల ఆ బానిస బ్రాతుకు అతనికి ఎంతో కష్టంగా ఉండేది. ఎలాగైనా ఆ బందిఖానాలోనుండి విముక్తి పొందాలని క్రూసో ఆలోచించసాగేడు.

ఆ దొంగల నాయకునివద్ద ఒక నీగ్రో బానిసకూడా ఉన్నాడు. క్రూసో అతనితో స్నేహం చేసి, అతన్ని మంచి చేసికొన్నాడు. ఆ ఇద్దరూ కలిసి ఎలాగైతేనేం రెండేళ్ళ తర్వాత ఆ నాయకుని తప్పించుకొని బయటపడ్డారు.

ఆ దొంగల నాయకుని ఓడలో ఒక చిన్న పడవ ఉంది. ఒకనాటి అర్ధరాత్రి వారిద్దరూ ఆ చిన్న పడవలో ఎక్కి సముద్రతీరం వెంబడే గమ్యంలేని ప్రయాణం సాగించారు. అప్పుడప్పుడుతీరం చేరుతూ ఆకలి దప్పులను తీర్చుకొంతూ కొన్నాళ్ళపాటు వారు ప్రయాణం సాగించారు. ఒకసారి ఒక తీరంవద్ద ఒక సింహం ఎదురయింది. అదృష్టవశాత్తు క్రూసో వద్ద దొంగలనాయకుని తుపాకీ ఉంది. దాంతో ఆ సింహాన్ని చంపి తన ప్రాణాలను కాపాడుకొని, తన మిత్రుని ప్రాణాలను రక్షించాడు. ఆ సింహం చర్మాన్ని క్రూసో భద్రపరిచాడు.

ఆ విధంగా వారు కొన్నాళ్ళు సముద్ర ప్రయాణం చేస్తూ ఉండగా ఒకనాడు వారికి పోర్చుగల్ దేశపు ఓడ ఒకటి కనబడింది. ఆ ఓడవైపు తమ పడవను మళ్ళించి క్రూసో తుపాకీని గాలిలో పేల్చాడు. ఓడలోనివారు వీరి పడవను చూసి వీరిని రక్షించ దలచుకొన్నారు. ఆ ఓడ కెప్టెన్ క్రూసోని అతని మిత్రుని ఆదరించి, వారిని ఓడలో ఎక్కించుకొన్నాడు. అందుకు క్రూసో ఆ ఓడ కెప్టెన్ కు తమ కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. తమ చిన్న పడవను, తను చంపిన సింహముయొక్క చర్మాన్ని, ఇంకా మరికొన్ని వస్తువులను ఆ కెప్టెన్ కు కానుకగా సమర్పించాడు. కాని ఆ ఓడ కెప్టెన్ వాటిని ఉచితంగా తీసికొనడానికి నిరాకరించి, వాటికి విలువ కట్టి డబ్బు ఇచ్చాడు.

ఆ ఓడ కొన్నాళ్ళకు దక్షిణ అమెరికాలోని బ్రెజిల్ పట్నం చేరుకొంది. క్రూసో మరి ముందుకు వెళ్ళకుండా ఆ పట్నంలో ఉండిపోదలిచాడు. అతని నీగ్రో మిత్రుడు ఆ ఓడలో పని చేయటానికి కుదురు కొన్నాడు.

క్రూసో బ్రెజిల్ పట్నంలో చిన్న స్థలం కొనుక్కొని చిన్న ఇల్లు కట్టుకొని అక్కడ స్థిరపడ్డాడు. అక్కడ కూడా అతనికి కొంతమంది మంచి స్నేహితులు దొరికారు. అక్కడ అతడు నాలుగు సంవత్సరాలపాటు స్థిరంగా ఉన్నాడోలేదో అతని స్నేహితులలో కొందరు ఆఫ్రికా దేశం వెళ్తూ క్రూసోను ఆహ్వానించారు.

ఆఫ్రికా వెళ్తున్న ఆ స్నేహితులలో కొందరు వ్యాపారస్తులు, కొందరు తోటల సొంతదారులు, ఈ తోటల సొంతదారులకు వారి తోటలలో పని చేయడానికి నీగ్రో బానిసలు కావాలి. ఆఫ్రికాలో బానిసలను డబ్బు ఇచ్చి కొనుక్కోవచ్చును. అందుకోసమే వారు వెళ్తున్నారు. ఆ స్నేహితులు క్రూసోను ఏ కర్చూ లేకుండా తీసికొను వెళ్ళి తీసికొని రావడమేకాక పెట్టుబడిలేకపోయినా అతనికి లాభాలలో భాగం ఇస్తామన్నారు. సముద్రయానం అంటే ఒడలు తెలియని క్రూసో ఆ లాభసాటి ప్రయాణానికి వెంటనే అంగీకరించాడు.

వారి వాణిజ్య నౌక బ్రెజిల్ నండి ఆఫ్రికా దేశానికి ప్రయాణమయింది. ఓడ బయలి దేరిన నాడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. పన్నెండు రోజులపాటు వారి ప్రయాణం సుఖంగా గడిచింది కాని పదమూడవ నాడు పెనుగాలి వీచడం మొదలుపెట్టింది. రానురాను పెనుగాలి ఎక్కువ అవుతూ వచ్చింది. ఓడ వారి అధీనంలో లేకుండా పోయింది. దానిని వారు గాలిపాటుకు వదలి పెట్టవలసి వచ్చింది. పదిహేను రోజులపాటు ఆ ఓడ గాలి వాటుగా సాగిపోయింది. తర్వాత గాలి తగ్గింది. అప్పటికి వారు వెస్ట్ ఇండీస్ దీవులకు చేరువలో ఉన్నట్టు ఆ ఓడ కెప్టెన్ తెలిసికొన్నాడు. ఆ దీవులను చేరుకొని కొన్నాళ్ళు విశ్రాంతి తీసికోవాలని ఆ ఓడలోని వారు అనుకొన్నారు. కాని యింతలో మళ్ళా పెనుగాలి వచ్చింది. ఓడ వారి అధీనం తప్పింది. అది సముద్రంలో ఊగిసలాడిపోయింది. రెండు రోజులపాటు అది వేరొక దిక్కుగా ప్రయాణం సాగించింది.

రాను రాను ఆ పెనుగాలి ఉధృతమైన భయంకర తుఫానుగా మారింది. ఉవ్వెత్తున కెరటాలు లేచి ఓడను తాకడం మొదలు పెట్టాయి. ఆ కెరటాల తాకిడికి ఓడ ఏ క్షణాన్నైనా ముక్కలు కావచ్చునన్న భయం ఆ ఓడలోని వారికి కలిగింది. ఎంత తోడుతున్నా ఓడలోనికి నీరు ఎక్కువగా చేరుతూ వచ్చింది.

అంతటి పెనుగాలిని, అంత ఉధృతమైన సముద్రాన్ని, అంత భయంకరమైన తుఫానును క్రూసో అంతకుముందుఎన్నడూ చూసి యెరగడు. రెండు రోజులపాటు సూర్యుడు ఆ ఓడలోని వారికి కనబడలేదు. ఆకాశం కారు మబ్బులతో మూసుకుపోయింది. మెరుపులతో, ఉరుములతో, పిడుగులతో వాతావరణం భయంకరంగా మారిపోయింది. వీటికి జడివాన ఒకటి తోడయింది. ఆ భయంకర పరిస్థితులలో ఓడ మునిగిపోక తప్పదని ఓడలోని వారందరూ అనుకొని భయపడ్డారు. ఓడ మునిగిపోకుండా కాపాడాలని ఓడ సరంగులు వారి శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారికి అన్ని విధాలా ఓడ ప్రయాణీకులు సహాయ పడుతూనే ఉన్నారు. ఓడ సరంగులు వేసే కేకలకు అందులోని ప్రయణీకులకు ఒకప్పుడు ఆశ ఒకప్పుడు నిరాశ కలుగుతూ వచ్చాయి. ఓడ విరిగి ముక్కలైనా, ఓడ సముద్రంలో మునిగినా ఆనాటితో ఆ ఓడలోని వారందరి జీవితాలు సమాప్తమౌతాయి. క్రూసో కధ పూర్తి అవుతుంది.

ఆ ఓడలోని వారందరూ దేవునిపైని భారంవేసి ఆ దేవుని ప్రార్ధిస్తూ తమ అంతిమ యాత్రకోసం రెండు రోజులు నిరీక్షించారు. వారికి ఆ రెండు రోజులు రెండు యుగాలుగా అనిపించాయి.

ఆ ఆపద సమయంలో క్రూసోకు తన గత జీవితం కళ్ళకు కట్టింది. వీరితో బయలుదేరకుండా బ్రెజిల్ పట్నంలో తన ఇంటి పట్టున ఉంటే బాగుండుననిపించింది. అసలు, తన తండ్రి మాట విని న్యాయవాదిగా యార్క్ లోనే

ఉండి ఉంటే ఇంకా హాయిగా బాగుండేది. పెద్దలమాట పెడచెవిని పెట్టినందుకు శిక్ష అనుభవించక తప్పదనుకొన్నాడు. తన వారంతా తన కళ్ళకు కట్టారు. వారి క్షేమ సమాచారాలు అతనికి తెలియవు. తను ఎక్కడ ఉన్నదీ వారికి తెలియదు. ఓడ మునిగి తను చనిపొయినా వారికి తెలియదు. తను చనిపోయే ముందు వారందర్నీ ఒక్కసారి చూసే అవకాశం దొరికితే ఎంత బాగుండును అనిపించింది అతనికి. ప్రాణాలతో మళ్ళా యార్క్ వెళ్ళే ఆశ అతన్ని వదిలి ఆ తుఫానులో ఎగిరిపోయింది.

నిరాశా నిస్పృహలతో అతి భయంకరంగా రెండు రోజులు గడిచిన తర్వాత మూడవ రోజు ఉదయాన్నే ఓడ సరంగులో ఒకరు "అదిగో నేల! అదిగో నేల!" అని అతి సంతోషంతో అరవడం క్రూసోకు వినిపించింది. అందరితోపాటు క్రూసోక్కూడా ఎక్కడలేని ఆనందం కలిగింది. జీవితం మీద అందరికి ఆశ చిగురించింది. ఆ కేకలు వచ్చిన దిశగా క్రూసో వెళ్ళాడు.

అతన్ని ముక్కలుముక్కలుగా చీల్చి పారవేసేటట్టు పెను గాలి ఇంకా వీస్తున్నది. కళ్ళు మిరుమిట్లు గొలిపి అతన్ని గుడ్డి వాణ్ణి చేసేటట్టుగా ఒక పెద్ద మెరుపు మెరిసింది, చెవులు బద్దలయ్యేటట్టు ఒక ఉరుము ఉరిమింది. ఇంతలో ఓడ వెళ్ళి ఒక ఇసుక దిబ్బను ఢీకొంది.కెరటాలు ఉవ్వెత్తున లేచి ఓడమీద విరుచుకొని పడ్డయి.

"ఓడ ముక్కలవుతూంది. వెంటనే చిన్న పడవను సముద్రంలోకి దించండి" అంటూ ఓడ కెప్టెన్ అరచాడు. సరంగులు చిన్న పడవను నీటిలోనికి దించారు. ఓడలోని వారందరూ అందులోకి దూకారు. సరంగులు ఆ పడవను నేలవైపుకు మళ్ళించి తీసికొని వెళ్తూ ఉండగా ఒక పెద్ద కెరటం ఒక భూతంలా వచ్చి దానిని ముంచివేసింది. అందులోని వారందరూ నీటిలో మునిగి పోయారు. వారిలో రాబిన్సన్ క్రూసో కూడ ఉన్నాడు.

## అధ్యాయము - 3

రాబిన్సన్ క్రూసో మంచి ఈతగాడే. అయినా ఆ అల్లకల్లోలమైన సముద్రంలో ఒక చిన్న దుంగముక్కలాగ కెరటాల మధ్య ఊగిసలాడిపోయాడు. అతని అదృష్టం కొద్దీ ఒక పెద్ద కెరటం వచ్చి అతన్ని ఈడ్చుకొనిపోయి ఒక యిసుక దిబ్బపైని పడవేసింది.

క్రూసో చాలాసేపు ఆ యిసుక దిబ్బ పైని చలనం లేకుండా ఉండిపోయాడు. కొంతసేపటికి అతని కళ్ళు వీడాయి. అతను కళ్ళు తెరిచి చూస్తున్నా అతనికి ఏమీ కనబడలేదు. మరి కాస్సేపటికి అతనిలో కాస్త చలనం కలిగింది. అతి కష్టం మీద అతను బలాన్ని కాస్త కూడగట్టుకొన్నాడు. ఇటూ అటూ చూశాడు. అతడు ఎక్కడ ఉన్నదీ అతనికి తెలియలేదు. అతని కాళ్ళను కెరటాలు ఉండి ఉండి తాకుతున్నాయి. మెల్లగా డేకుకొంటూ అతడొక ఎత్తైన ప్రదేశాన్ని చేరుకొన్నాడు. అక్కడ పచ్చిక వత్తుగా ఉంది. అక్కడ కాస్సేపు విశ్రాంతి తీసికొన్నాడు. ఇంతలో అతనికి గతమంతా గుర్తుకు వచ్చింది. వెంటనే అతడు లేచి కూర్చొని తన మిత్రుల కోసం ఇటూ అటూ చూశాడు. సముద్ర కెరటాలు తీరాన్ని తాకి మీదకు లేచి కింద పడుతూ అతనికి భూతాల్లా కనిపించాయి కాని అతని మిత్రులు కనిపించలేదు.

తన ప్రాణాలను కాపాడినందుకు క్రూసో తన మోకాళ్ళపైని కూర్చొని దేవునికి కృతజ్ఞత తెల్పుకొన్నాడు. తను బ్రతికి బయటపడినందుకు అతనికి సంతోషం కలిగినా తన తోటి వారందరూ సముద్రంలో మునిగిపోయి ఉంటారన్న తలంపు రావడంతో అతనికి విచారం పట్టుకొంది. విచారంతోపాటు అతనికి భయం కూడా వేసింది. దాంతో అతడు పిచ్చి వానిలాగ కేకలు వేస్తూ సముద్రతీరాన్న ఇటూ అటూ తిరిగాడు.ఏమి చేయాలో అతనికి తోచలేదు

అతనికి విపరీతంగా ఆకలి వేస్తూంది కాని తినడానికి ఏమీ లేదు. నోరు ఆర్చుకొనిపోయి విపరీతంగా దాహం వేస్తూంది కాని తాగడానికి మంచి నీళ్ళు లేవు. తడిసిన బట్టలను మార్చుకొనడానికి మారు బట్టలు లేవు.కనుచూపు మేరలో మనిషి కాడు గదా ఒక జంతువైనా కనబడలేదు. కాని ఆకలితో కడుపు కాలుతున్నది. దాహంతో ప్రాణాలు పొయేటట్టుగా ఉన్నయి. ఈ రెండింటినీ తట్టుకోవాలంటే కనీసం ఒక చల్లని చోట విశ్రాంతి తీసికొనడం అవసర మనిపించింది క్రూసోకు, కాని అది కొత్త ప్రదేశం, కనుచూపు మేరలో మనిషి కాడు గదా ఒక జంతువైనా కనబడలేదు. కాని దూరంగా చెట్లు, తుప్పలు అడవిలాగ కనబడుతున్నై. ఎక్కడ పడుకొంటే ఏ క్రూర జంతువు తనను పొట్టను పెట్టుకొంటుందో నని అతనికి భయం వేసింది.

అతనికి అతనే ధైర్యం చెప్పుకొన్నాడు. ఆకలి తీర్చుకొనడానికి ఏమైనా దొరుకుతుందేమోనని లేచి నిల్చొని ఇటూ, అటూ చూశాడు. దూరంగా ఉన్న అడవిలో ఏదైనా తినడానికి దొరకవచ్చునన్న ఆశ అతనికి కలిగింది కాని ఇంతలో మళ్ళా అతనికి నిరాశ కలిగింది. ఏదైన ఆహారం దొరికి తను బ్రతికినా ఆ కొత్త ప్రదేశంలో తను ఒంటరిగా జీవించవలసి వస్తుంది. ఇక మీదట తనకు ఎదురుగా ఉన్న సముద్రం, సముద్రకెరటాలు, దూరాన కనబడే చెట్లుచేమలే తనకు స్నేహితులు అనుకొన్నాడు. ఇంతవరకు తనొక సంఘజీవిగా నలుగురితో కలిసి బ్రతికాడు. ఇక మీదట ఏకాకిగా బ్రతకాలి.ఈ ఆలోచన అతనికి కలగడంతో అతను వణికిపోయాడు.

ఇంతలో అతనికి దూరంగా చెట్ల మధ్యను ఏదో తళ తళ మెరుస్తూ కనబడింది. అటు వైపు తేరి పార చూశాడు. అదొక కొలనులాగ కనబడింది. కనీసం దాహం తీర్చుకొనవచ్చు నన్న ఆశ అతనికి కలిగింది. దాంతో అతనికి ఎక్కడ లేని బలం వచ్చింది. ఆ దిక్కుగా అతడు పరుగెత్తాడు. అది కొలను కాదు, అదొక

సెలయేరు. అతడు అతి తొందరగా ఆ సెలయేటిలోనికి దిగి నీరు త్రాగాడు. ఆ సెలయేటి నీరు ఎంతో తియ్యగా ఉంది. ఆర్చుకొనిపోయిన అతని నోటికి ఆ నీరు అమృతం అనిపించింది. తనివితీరా, కడుపునిండా నీళ్ళు త్రాగాడు, దాహం కట్టింది. కాస్త ఆకలి కూడా తీరింది. కడుపు చల్లబడింది. అప్పుడు అతడు మామూలు మనిషి అయ్యాడు. ఇకమీదట ఏమి చేయాలి అని అతడు ఆలోచించసాగాడు.

ఇంతలో ప్రొద్దుపోయింది. సంధ్య వెలుగు మాత్రమే ఉంది. కొద్ది సేపట్లో చీకటి అలుము కొంటుంది. కనుక క్రూర మృగాల వాత బడకుండా నిద్రపోవడానికి అనువైన స్థలాన్ని క్రూసో చూసికొనదలిచాడు. కొద్ది దూరంలో ఒక పెద్ద చెట్టు అతనికి కనబడింది. ఆ చెట్టు కొమ్మలు నలువైపులా బాగా వ్యాపించి ఉన్నాయి. దాని కొమ్మలు చాలా బలమైనవి. ఆ చెట్టు ఎక్కి ఒక బలమైన కొమ్మ మీద పడుకొని ఆ రాత్రి నిర్భయంగా గడపవచ్చునని అతడు అనుకొన్నాడు. వెంటనే అతడు ఆ చెట్టువద్దకు వెళ్ళాడు. ఒక కొమ్మను విరిచి ఆత్మరక్షణ కోసం దానిని ఒక ఆయుధంగా ఆ చెట్టు ఎక్కాడు. ఒక వెడల్పైన కొమ్మ మీద మేను వాల్చాడు. అలిసిపోయిన రాబిన్సన్ క్రూసోకు సురక్షితమైన చోటు దొరకగానే హాయిగా గాఢ నిద్ర పట్టింది.

ఆ మరునాడు సూర్యోదయం అయిన తరువాత గాని అతనికి మెలకువ రాలేదు. ఆకుల చాటు నుండి తన పైని పడుతున్న వెచ్చని . ఎండకు అతనికి మెలకువ వచ్చింది. అతడు లేచి కూర్చొని, కళ్ళు నులుపుకొని, వళ్ళు విరచుకొని, బద్ధకం తీరేటట్టు ఆవలించి కళ్ళు విప్పి చుట్టూ కలియజూశాడు. అప్పుడు అతనికి అతనెక్కడ నిద్ర లేచింది గుర్తుకు వచ్చింది

ఆకాశం నిర్మలంగా ఉంది. చెట్ల ఆకులనుకూడా కదల్చలేనంత మెల్లగా గాలి వీస్తున్నది. సముద్ర కెరటాలు ఎగిరెగిరి పడడం లేదు. సముద్రం ప్రశాంతంగా ఉంది.

వాతావరణం హాయిగా ఉంది.

క్రూసో చెట్టు దిగి సముద్రం వైపు బయలు దేరాడు. నాలుగు అడుగులు వేశాడో లేదో దూరంగా సముద్రంలో ఓడ కనబడింది. అది విరిగిపోయి ప్రక్కకు వాలిపోయి ఉంది. దానిని చూడడంతోనే క్రూసో ఒక పెద్ద కేక వేశాడు. అది ఆశ్చర్యమో సంతోషమో చెప్పడం కష్టం. అతడు పరుగెత్తాడు. సుమారు అర మైలు దూరంలో ఆ ఓడ ఒక బండరాయికి గుద్దుకొని విరిగి నీటిలోనికి ఒరిగిపోయి ఉంది. గాలికి గత రాత్రి ఆ ఓడ అక్కడకు చేరి ఉండవచ్చునని క్రూసో ఊహించాడు. ఆ విరిగిన ఓడను చూస్తూ కాస్సేపు అతడు నిల్చున్నాడు.

గత సాయంత్రం నీళ్ళతో మాత్రం కడుపు నింపుకొన్న అతనికి ఆకలి వేయసాగింది. క్షణ క్షణానికి ఆకలి ఎక్కువ కాజొచ్చింది. తినడానికి ఏదైనా ఆ ఓడలో దొరకవచ్చునన్న ఆశ అతనికి కలిగింది. కనుక ఆ ఓడ మీదకు ఎలాగైనా వెళ్ళదలచు కొన్నాడు గాని సముద్రం పోటులో ఉంది. అందువల్ల అతడు సెలయేటికి వెళ్ళి మరొకసారి నీళ్ళతో ఆకలి తీర్చుకొన్నాడు.

మధ్యాహ్నానికి సముద్రపు పోటు తగ్గింది. అదే తగిన సమయమని క్రూసో తలచి, నీళ్ళలో దిగి ఈదుకొంటూ ఓడను చేరుకొన్నాడు. ఓడ అంచులు నీటి మట్టానికి చాలా ఎత్తుగా ఉన్నాయి. ఓడ పైకి ఎక్కడానికి ఎటు నుండి వీలుందో చూడడానికని ఈదుకొంటూ ఒకసారి ఓడ చుట్టు ప్రదక్షిణం చేశాడు. ఓడ లోనుంచి వ్రేలాడుతున్న ఒక మోకు ఒక చోట అతనికి కనబడింది. దాని ఆధారంతో అతడు ఓడపైకి ఎక్కి లోనికి దిగాడు.

ఏవో మూడు చిన్న ఆకారాలు ఆ ఓడలో ఇటూ అటూ పరుగెత్తుతున్నట్లు అతనికి కనబడ్డాయి. అతనికి భయం వేసింది. ఇంతలో ఒక కుక్క తోక ఆడిస్తూ

అతని కాళ్ళను నాకుతూ అతని చుట్టూ తిరగసాగింది. దాని వెంట రెండు పిల్లులు కూడా వచ్చాయి. ఆ మూడూ అతి సంతోషంతో అతని చుట్టూ తిరగడంతో అతనికి ఒంటరితనం పోయినట్టు అనిపించింది. కుక్కకు పిల్లులకు పుట్టుకతోనే వైరమున్నా అవి ఆపద సమయంలో మైత్రిని అలవరచుకొన్నాయి. వాటికి తనే యజమాని అయినాడు. అతడు వాటిని ప్రేమతో దువ్వాడు. ఆ మూడూ అతనికి చేరువైనాయి. ఓడలో ఏమూల నేమున్నదో అతడు చూడదలచుకొని ఓడలో తిరగనారంభించాడు. ఆ మూడు జంతువులు అతని వెంట బడ్డాయి.

సముద్రంలోని ఒక బండరాయికి ఓడ ఢీకొని ముందుకు వాలిపోయింది. నీటి అడుగున ఉన్న బండరాళ్ళమీద ఓడ వెనుక భాగం ఆనుకొని నీటిలో మునగ లేదు. ఓడ ముందు భాగంలో నీరు నిండుగా ఉంది. వెనుక భాగం పొడిగా ఉంది. క్రూసో అదృష్టం కొద్దీ వెనుక భాగంలోనే ఆహారపదార్థాలు, పనిముట్లు ఆయుధాలు ఉన్నయి. అవి తడిసిపోకుండా భద్రంగా ఉన్నాయి. అందుకు అతడు ఎంతో సంతోషించాడు. వెంతనే అతడు కొన్ని బిస్కట్లను తీసికొని పంట్లాం జేబులు నింపుకొన్నాడు. తను తింటూ, కుక్కకు, పిల్లులకు బిస్కట్లను వేస్తూ తనకు పనికివచ్చే సామానులు ఏవేవి ఎక్కడెక్కడ ఉన్నాయో అతడు ఒకసారి చూసికొన్నాడు.

ఏ క్షణాన్నయినా ఆ విరిగిన ఓడ మునిగిపోవచ్చును. అలా జరిగితే ఓడలోని ఏ ఒక్క వస్తువూ తనకు దక్కదు. కనుక తనకు అత్యవసరంగా కావలసిన సామానులను, ఆహారపదార్థాలను మాత్రం వీలయినంత త్వరలో ఒడ్డుకు చేర్చాలని నిర్ణయించికొన్నాడు.

సుమారు అరమైలు దూరంలో తీరం ఉంది. ముందుగా ఆహారపదార్థాలను, తన కొత్త స్నేహితులయిన కుక్కను, పిల్లులను ఒడ్డుకు చేర్చాలి. ఒక చిన్న పడవ

ఉంటే ఈ పని సులువుగా జరుగుతుంది. ఓడలో ఉండిన ఆ ఒక్క చిన్న పడవా క్రిందటి రోజున నీటిలో మునిగిపోయింది. వేరొకటి ఆ ఓడలో లేదు. లేనిదానికోసం ఆలోచిస్తూ కూర్చుంటే కాలం దండగ అవుతుంది తప్ప సమస్య పరిష్కారం కాదు. కనుక ఏదో ఒక ఉపాయం ఆలోచించి తన కార్యాన్ని సాధించదలచుకొన్నాడు క్రూసో.

ఒకసారి ఇటూ అటూ అతడు కలియజూశాడు. కొన్ని తెరచాప కొయ్యలు, కొన్ని బల్ల చెక్కలు, కొన్ని మోకుతాళ్ళ ముక్కలు అతని కంటబడ్డాయి. వెంటనే అతడు వాటిని ఒక చోట చేర్చి వాటితో ఒక తెప్పను తయారు చేశాడు. దానిని ఒక మోకుకు కట్టి నీటిలోనికి దించాడు. ఆ తెప్ప కెరటాలకు కొట్టుకొని పోకుండా ఆ మోకును ఓడకు కట్టాడు.

ఓడలో కొన్ని ఖాళీ పెట్టెలు ఉన్నాయి. వాటిలో మూడు పెద్ద పెట్టెలను క్రూసో ఎంచాడు. రొట్టెలు, బిస్కట్లు, గోధుమలు, బార్లీ మొదలైన ఆహార పదార్థాలతో ఒక పెట్టెను నింపాడు. ఇంకొక దానిలో తనకు కావలసిన బట్టలను సర్దాడు.మూడవ దానిలో సుత్తి, రంపం, గొడ్డలి మొదలైన పనిముట్లను పెట్టాడు. ఆ మూడు పెట్టెలను అతి కష్టం మీద జాగ్రత్తగా తెప్ప మీదకు మోకుల సహాయంతో దింపాడు. ఇంతలో అతనికి ముఖ్య మైన రైఫిళ్ళూ, పిస్తోళ్ళు, మందుగుండు, సొరకత్తులు గుర్తుకు వచ్చాయి. వెంటనే వాటికోసం ఓడలో వెతికాడు. అతనికి రెండు రైఫిళ్ళూ, రెండు పిస్తోళ్ళు, రెండు సొరకత్తులు ఒక మందుగుండు బస్తా మాత్రం అతనికి కనిపించాయి. నీరు తగలకుండా వాటిని కూడా తెప్ప మీదకు అతడు చేర్చాడు. తెరచాప గుడ్డలను కూడా తెప్ప మీద పడవేశాడు. తన అత్యవసరమైన సామగ్రి తెప్ప మీదకు చేరినట్టు నిర్ధారణ చేసికొన్న తర్వాత పిల్లులని, కుక్కను తెప్ప మీదకు దించి తనుకూడా తెప్ప మీదికి దిగాడు.

సముద్రంలో పోటు వచ్చింది. గాలివాటు తీరం వైపే ఉంది. వాతావరణం తనకు అనుకూలంగా ఉన్నందుకు అతడు సంతోషించి, దేవునికి తన కృతజ్ఞతలు తెల్పుకొని తెప్పను ఓడకు కట్టిన తాడును కోశాడు. ఒక విరిగిన తెడ్డు సహాయంతో తెప్పను అతడు ఒడ్డుకు చేర్చాడు. ఒడ్డున ఇసుకలో తెడ్డును పాతి, పోటు తగ్గే వరకు తెప్పను దానికి కట్టి ఉంచాడు. కొంతసేపటికి పోటు తగ్గింది. సామాను బరువుకు తెప్ప ఇసుక మీద ఉండి పోయింది.

తెచ్చిన వస్తుసామగ్రిని గతరాత్రి అతడు పడుకొన్న చెట్టు వద్దకు చేర్చడానికి అతనికి కొన్ని గంటలు పట్టింది. కొంతసేపు విశ్రాంతి తీసికొన్న తర్వాత పరిసర ప్రాంతాలను అతడు ఒకసారి పరిశీలించదలచాడు. అతనికి చేరువలోనే ఒక చిన్న కొండ ఉంది. అతడు ఒక రైఫిల్లో మందుగుండు దట్టించి దానిని తన భుజం మీద వేసికొని ఆ కొండ ఎక్కాడు. ఆ కొండ శిఖరం పైనుండి చుట్టూ చూశాడు. అతని చుట్టూ దూరాన సముద్రమే కనబడింది. దాంతో తానొక ద్వీపం మీద ఉన్నట్టు అతడు గ్రహించాడు. ఆ ద్వీపానికి పశ్చిమ దిక్కున రెండు ఇసుక దిబ్బలు, ఓడ పడి ఉన్నచోట బండరాళ్ళు తప్ప కనుచూపు మేరలో ఇంకెక్కడా భూప్రదేశం అతనికి ఆ సమయంలో కనబడలేదు. అతడు ఉన్న ద్వీపం మీద అతనికి కొన్ని పక్షులు తప్ప ఇంకే ప్రాణి కనబడలేదు. అతనికి చేరువులో ఒక చెట్టు మీద పక్షులు కొన్ని వాలి ఉన్నాయి. తన రైఫిల్ తో ఆ చెట్టు మీది పక్షులను కొట్టాడు. ఒక పక్షి మాత్రం ఆ దెబ్బకు నేలకూలింది. కొన్ని వందల పక్షులు ఆ తుపాకి శబ్దానికి ఆకాశంలో ఎగురుతూ ఇంకొక చోటికి పోయాయి. ఆ తుపాకి శబ్దానికి ఏవైనా జంతువులుగాని, ఎవరైనా మనుష్యులు గాని వచ్చి తనకు కనబడ వచ్చునని అతడు ఆశించాడు. కాని అలా జరగలేదు. అతని ఆశ నిరాశ అయింది.

ఆ ద్వీపం మీద తానొక ఒంటరి మనిషినన్న భావం అతనిలో స్థిరంగా

ఏర్పడింది. దాంతో అతనికి ఎంతో విచారం కలిగింది. మళ్ళా మనుష్య ప్రపంచంలోనికి వెళ్ళే అవకాశం త్వరలో కలుగదని అతడు అనుకొన్నాడు. అందువలన ఒక సురక్షితమైన వసతిని ఏర్పరచుకోవలసిన అవసరం ఉందని అతడు భావించాడు. అందుకు తగిన ప్రదేశం కోసం అతడు ఆ కొండపైనుండి చూశాడు కాని ఏ స్తలాన్ని నిర్ణయించుకొనలేకపోయాడు.

ఇంతలో పొద్దువాలింది. అందువల్ల అతడు వెంటనే కొండ దిగి తన చెట్టు వద్దకు చేరుకొన్నాడు. అక్కడే చదునైన ప్రదేశం చూసి, తెరచాప గుడ్డతో ఒక చిన్న గుడారాన్ని వేసి అందులో అతి ముఖ్యమైన సామానులను అతడు భద్రపరచాడు. ఆ గుడారంలో నేలపైనే ఒక పడకను అతడు ఏర్పరచుకొన్నాడు. ఆ రోజంతా బాగా కష్టపడి పనిచేసినందువల్ల అతడు అలసిపోయాడు. పడక చేరగానే అతనికి గాఢ నిద్ర పట్టింది.

ఆ మర్నాడు క్రూసో ఈదుకొంటూ మళ్ళా ఓడ మీదకు వెళ్ళాడు. మరొక తెప్పను తయారు చేసి తనకు అవసరమైన మరికొన్ని ఆయుధాలను, బట్టలను, ఒక పరుపును ఇంకా మరికొన్ని ఇతర వస్తువులను ఒడ్డుకు చేర్చాడు. ఈ విధంగా అతడు పదకొండు సార్లు ఓడ మీదకు వెళ్ళి తనకు కావలసిన అతి ముఖ్యమైన సామానులన్నిటిని తెచ్చుకొన్నాడు. ఆఖరు సారి అతడు ఓడ మీదకు వెళ్ళినప్పుడు అతనికి ఒక బీరువాలో ఒక కత్తెర, రెండు మంగలి కత్తులు, రెండు చాకులు, నాలుగు ఫోర్కులు అతనికి దొరికాయి. నాణాలు రూపంలో కొంత డబ్బు కూడా అతనికి దొరికింది. ఆ నాణాలకు ఆ ద్వీపం మీద విలువలేకపోయినా అతడు వాటిని జాగ్రత్త పెట్టాడు.

ఆ ద్వీపం మీదకు అతడు చేరిన పదిహేను రోజుల తరువాత ఒకనాడు మరొక గాలి వాన వచ్చింది. ఆ నాడంతా అతడు గుడారంలో నుండి బైటకు

రాలేదు. గాలివాన వెలిసిన తరువాత ఆ మరునాడు అతడు గుడారంలోనుండే సముద్రం వైపు చూశాడు. అతనికి ఓడ కనబడలేదు. ఆ గాలివానకు అది ముక్కముక్కలై కొట్టుకొనిపోయి ఉంటుందని అతడు అనుకొన్నాడు.

## అధ్యాయము - 4

గడచిన పదిహేను రోజులలోను ఆ ద్వీపంమీద రాబిన్సన్ క్రూసోకు వేరొక మానవుడు కనబడలేదు. తాను తప్ప ఆ ద్వీపంమీద వేరొక మానవుడు లేడన్న అభిప్రాయం అతనికి కలిగినా అతడు ఇంకా ఆ ద్వీపాని పూర్తిగా చూడకపోవడం వల్ల అతని అభిప్రాయంమీద అతనికే పూర్తిగా విశ్వాసం కుదరలేదు. ఆ ద్వీపంమీద ఏ మూల ప్రాంతంలోనైనా అనాగరికులైన అడవి మనుష్యులు ఉండవచ్చు నన్న అనుమానం అతన్ని బాధిస్తూనే ఉంది. ఆ పదిహేను రోజుల్లో అతనికి పక్షులే కనబడ్డాయి. అయినా ఏ అడవి ప్రాంతంలోగాని, కొండ చరియల్లో గాని క్రూర జంతువులు ఉండవచ్చునన్న భయం అతనికి ఉంది. రాత్రీ పగలు ఆ ద్వీపంమీద అతనికి ప్రశాంతంగానే ఉంటున్నదిగాని తనకు కనబడని శత్రువులు ఏమూలనైనా ఉంటే ఉండవచ్చును. కనుక తనను తాను రక్షించుకొనడానికి తగిన ఇల్లు అవసరమని క్రూసో భావించాడు.

ఇల్లు కట్టుకొనేటప్పుడు అతడు ముఖ్యంగా నాలుగు సూత్రాలను పాటించదలచుకొన్నాడు. మొదటి సూత్రం : మంచి నీటికి చేరువలో ఆరోగ్యకరమైన ప్రాంతంలో నివేశ స్థలం ఉండాలి. రెండవ సూత్రం : ఇంటికి ఎండవేడి ఎక్కువగా తగలకూడదు, చల్లగా ఉండాలి. మూడవ సూత్రం : శత్రువుల బారినుండి తనను తాను రక్షించుకొనడానికి అనువైన స్థలంలో ఇల్లు కట్టుకొనాలి. నాల్గవ సూత్రం : అదృష్టవశాత్తు ఏదైనా ఓడ ఆ ద్వీపానికి చేరువగా వస్తే అది తన ఇంటినుండి కనబడాలి.

తన గృహనిర్మాణానికి అటువంటి అనువైన స్థలం లభిస్తుందేమోనని అతడు వెతికాడు. కొండకు తూర్పు వైపున ఆనుకొని ఉన్న చిన్న చదునైన ప్రదేశం అనువైనదిగా క్రూసోకు తోచింది. ఆ స్థలం సుమారు రెండు వందల గజాల పొడవు, వంద గజాల వెడల్పు ఉండవచ్చునని అతడు లెక్కవేశాడు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకొంటే ఆ కొండే తన ఇంటికి వెనకవైపు పెట్టనిగోడగా ఉంటుందని, సాయంత్రం వరకు ఎండ తగలకుండా ఆ కొండ కాపాడగలదని అతనికి తోచింది. అందువల్ల ఆ స్థలాన్ని తన నివేశ స్థలంగా అతడు స్థిరపరచుకొన్నాడు.

అతడు సముద్రం వైపు ముఖం పెట్టి కొండకు చేరువగా నిల్చున్నాడు. అక్కడనుంచి ముందుకు పది అడుగులు వేసి అక్కడ ఒక గుర్తు పెట్టాడు. మళ్ళా అదే చోటుకు వచ్చి కుడి ఎడమ ప్రక్కలకు పదేసి అడుగులు వేసి గుర్తులు పెట్టుకొన్నాడు. ఈ మూడు గుర్తులను కలుపుతూ అర్ధ చంద్రాకారంలో ఒక గీతను గీశాడు. దానిమీద అయిదు అడుగుల ఎత్తున సూది మొనలుగల రాటలను పాతాడు. ఆ విధంగానే ఆ రాటలకు ఆరంగుళాల ఎడంలో మరొక వరుసను రాటలు పాతాడు. ఆ రెండు వరుసల రాటలను కలుపుతూ ఓడలోనుంచి తెచ్చిన ఇనుప తీగలను చుట్టాడు. ఆ రెండు వరుసల మధ్యను రాళ్ళను మట్టిని నీళ్ళతో కలిపి పోశాడు. ఈ విధంగా కొన్ని రోజులు కష్టపడి ముందుగా ఒక గట్టి గోడను అతడు నిర్మించాడు. ఆ గొడకు ఎక్కడా ద్వారాన్ని అమర్చలేదు. అతడు ఒక నిచ్చెనను తయారుచేసి దాని సహాయంతో అతడు ఆ గోడను దాటుతూ ఉండేవాడు.

వెనుకవైపు నున్న కొండే ఒక గోడగా ఉంది. ఆ కొండ లోని ఒక రాతిబండకు ఒక పెద్ద కన్నం ఉంది. తన ఆహారపదార్థాలను, మందుగుండును, ఇతర ముఖ్యసామగ్రిని అందులో అతడు భద్రపరచుకొన్నాడు.

ఓడలోనుంచి తెచ్చిన తెరచాప గుడ్డలతో కొండకు చేరువుగా ఒక చిన్న

గుడారాన్ని క్రూసో వేశాడు. దాని పైని మరొక పెద్ద గుడారాన్ని వేశాడు. ఎంత పెద్ద వాన వచ్చినా లోపలకు నీరు కారకుండా ఈ రెండు పొరల గుడారం తనను కాపాడగలదన్న నమ్మకం అతనికి కలిగింది. ఓడలోనుండి తెచ్చిన ఒక వల ఉయ్యాలను ఆ గుడారంలో కట్టుకొని అందులోనే అతడు పడుకొని నిద్రపోయేవాడు.

ఆ ద్వీపం మీద అతడు ఒంటరి వాడు. రోజులు గడుస్తున్న కొద్దీ గడచిన రోజుల లెక్క అతనికి జ్ఞప్తియందు ఉండకపోవచ్చును. కనుక ఏదో ఒక రకమైన కాలెండరు అత్యవసరమని అతనికి తోచింది. అందుకని అతనొక బల్లచెక్కను తీసికొని దానిని సాఫుగా చిత్రిక పట్టి దానిపైని "ఈ ద్వీపానికి 1659 సెప్టెంబర్ 30వ తేదీన చేరాను" అని చాకుతో చెక్కాడు. తన ఇంటి ముందు ఒక రాటను పాతి దాని మీద ఆ బల్లను మేకులతో బిగించాడు. ఆ రాట మీద ప్రతిరోజూ క్రూసో ఒక నిలువు గీత గీస్తూ ఉండేవాడు. ప్రతి ఏడవ గీతను అంటే ప్రతి ఆదివారం నాటి గీతను ఇతర గీతల కంటే కొంచెం పొడవుగా గీసే వాడు. ప్రతి మొదటి తేదీ గీతా ఆదివారం గీతకు రెండింతలు ఉండేది. ఈ విధంగా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలను క్రూసో లెక్కిస్తూ వచ్చాడు.

ఓడలోనుండి తెచ్చిన ఆహార పదార్థాలను తింటూ కూర్చుంటే అవి కొన్నాళ్ళకు తరిగిపోతాయి. తర్వాత తినడానికి ఇంకేమీ మిగలదు. కనుక అవి పూర్తిగా తరిగి పోక ముందే వేరే ఆహారాన్ని అతడు సంపాదించుకోవాలి. అందుకని అతడు తుపాకీని పట్టుకొని రోజూ వేటకు వెళ్ళడం ప్రారంభించాడు. అతని వెంట అతని కుక్క తోడుగా వెళ్ళేది. క్రూసో చంపిన పక్షుల్ని ఆ కుక్క వెళ్ళి నోట కరచుకొని తెచ్చేది.

మధ్యాహ్నం పూట ఆ ద్వీపం మీద ఎండవేడి ఎక్కువగా ఉండేది. అందువల్ల ఎండ బాగా ఎక్కగానే క్రూసో ఇంటికి వచ్చి ఏదో ఇంత తిని పడుకొనేవాడు. ఆ

సమయంలో అతడు ఏ పనీ చేసేవాడు కాడు.

ఒకనాడు అతడు వేటకు వెళ్ళినప్పుడు అతనికి కొన్ని గొర్రెలు కనబడినయి. అవి చాలా పిరికివి. క్రూసోను చూడగనే అవి అడవిలోనికి పారిపోయాయి. వాటిని తుపాకితో చంపాలని క్రూసో ఎంత ప్రయత్నించినా అవి దొరక్కుండా తప్పించుకొన్నాయి. ఎలాగైతేనేమి అతడొకసారి ఒక ఆడ గొర్రెని తుపాకితో కాల్చి చంపాడు. దాని వెంట ఒక చిన్న గొర్రెపిల్ల ఉంది. దానిని అతడు సులువుగా పట్టుకొన్నాడు. చంపిన గొర్రెను దాని పిల్లను మోసుకుని అతడు తన ఇంటికి తీసుకొనివచ్చాడు. పెద్ద గొర్రె మాంసాన్ని అతడు కాల్చుకొని విందారగించాడు. గొర్రెపిల్లను మచ్చిక చేసుకొని, పెంచాలని అతడు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. అది దాని తల్లి కోసం బెంగపెట్టుకొని తిండి మానివేసింది. అందువల్ల క్రూసో దాన్నికూడా చంపి విందు చేసుకొన్నాడు.

ఇంకొకనాడు క్రూసోకు ఒక గొర్రెపిల్ల ఒంటరిగా కనబడింది. దానిని చంపకుండా ఎలాగైనా పట్టుకొనాలని ఎంతో ప్రయత్నించాడు కాని అది అతనికి దొరకలేదు. అందువల్ల అతడు దాని కాలును గురిచూసి తుపాకీని పేల్చాడు. ఆ దెబ్బకు అది కింద పడింది. దానికి చికిత్స చేసి కాలుకు కట్టుకట్టాడు. తన చేత్తో దానికి మేత పెడుతూ వచ్చాడు. కొన్నాళ్ళకు అది తేరుకొంది. అతనివద్ద దానికి చనువు ఏర్పడింది. ఆ విధంగా అది అతనికి పెంపుడు జంతువు అయింది. అది అతని చుట్టూ తిరుగుతూ, అతని ఇంటి ముందు పచ్చిక మేస్తూ ఉండేది.

రాబిన్సన్ క్రూసో ఒక రామచిలుకనుకూడా పెంచాడు. మధ్యాహ్నం నిద్రపోయి లేచిన తర్వాత తన ఇంటికి కావలసిన సామగ్రిని తయారు చేసికొంటూ రామచిలుకకు మాటలు నేర్పుతూ ఉండేవాడు. అతన్ని "క్రూసో" అని రామచిలుక పిలిచేది. నేర్పిన అన్ని మాటలను వల్లిస్తూ ఉండేది. దాని మాటలకు క్రూసో

మురిసిపోయి ఆనందిస్తూ ఉండేవాడు.

తన ఇంటికి కావలసిన అనేక కర్రసామానులను క్రూసో తయారు చేసికొంటూ వచ్చాడు. అతనికి ఒక కుర్చీ, ఒక టేబిలు అవసరమనిపించాయి. క్రింద కూర్చొని భోజనం చేయడం అతనికి కష్టంగా ఉండేది. అందుకని అతడు ఓడలోనుండి తెచ్చిన కర్రచెక్కలతో వాటినికూడా తయారు చేసికొన్నాడు. అతడు తన దినచర్యను డైరీలో వ్రాసికొనడానికి ఆ కుర్చి టేబిలూ ఎంతో ఉపయోగపడేవి.

అతడు కొన్ని కర్ర షెల్ఫులను తయారు చేసికొన్నాడు. వాటిని రాతిబండలో నున్న ఆ పెద్ద కన్నంలో అమర్చాడు. తన పనిముట్లను, మేకులను ఇతర ఇనుప సామానులను ఆ షెల్ఫుల్లో తడి తగలకుండా భద్రపరచాడు. కొన్ని బల్ల చెక్కలను కొండగోడకు మేకులు కొట్టి తాపడం చేశాడు. వాటి మీద తన రైఫిళ్ళను, పిస్తోళ్ళను వ్రేలాడ వేశాడు. ఈ ఏర్పాట్లన్నిటిని చేసికొని క్రూసో ఎంతో తృప్తి పడ్డాడు. అంతే కాదు తన పనితనానికి ఎంతో గర్వ పడ్డాడు.

నేలను తవ్వడానికి ఒక పార తనకు అవసరమయింది. ఒక గట్టి మానులోని ఒక ముక్కను తీసికొని దానిని చెక్కి పార లాగ తయారు చేసికొన్నాడు. తగిన వడ్రంగి పనిముట్లు అతని వద్ద లేకపోయినందువల్ల వీటిని తయారు చేయడానికి చాలా కాలం పట్టింది. అవన్నీ కాస్త మొరటుగా ఉన్నా అవి ఎందుకు అలా ఉన్నాయి అని కాని, ఇంత ఆలస్యం ఎందుకు అయిందని కానీ అతన్ని అడిగేవారు ఎవరూ లేరు.

తన ఇంటిలోని కొండ గోడలో ఒక చోట చిన్న గుహ వంటిది ఉంది. దానిలో మన్ను మెత్తగా ఉన్నట్టు అతనికి కనబడింది. తన కర్రపారతో ఆ మట్టిని అతడు ఒకనాడు తవ్వి చూశాడు. పారకు మట్టి సులువుగానే వచ్చింది. వీలయినంత వరకు

అతడు తవ్వుతూ వెళ్ళాడు. కొంతసేపటికి ఆ గుహలో నుండి వెలుపలికి వచ్చాడు. అతడు ఎక్కడ ఉన్నదీ చూసుకొంటే తన ఇంటికి కొన్ని గజాల దూరంలో ఉన్నట్టు అతడు తెలిసికొన్నాడు. కొత్తగా ఏర్పడిన ఈ సొరంగం తన ఇంటికి ఒక ద్వారంలా ఉపయోగ పడగలదని అతనికి అనిపించింది. దానికి ఒక తలుపుని అమర్చాడు. ఈ సొరంగం వల్ల తన ఇంట్లో జాగా ఎక్కువయింది.

రోజూ చీకటిపడిన తర్వాత ఏ పని చేసికొనడానికి వీలు లేక నిద్ర రాకపోయినా అతడు వేగంగా పడుకొనవలసి వచ్చేది. అతని వద్ద ఏ రకం నూనే లేదు, దీపం లేదు. కనీసం కొవ్వొత్తి కూడా లేదు. చీకట్లో ఏమీ తోచక అలా పడుకొనడం అతనికి నచ్చలేదు. దీనికి ఒక ఉపాయం ఆలోచించి అతడు చంపిన గొర్రెలలోని కొవ్వును దాస్తూ వచ్చాడు. బంకమట్టితో ఒక ప్రమిదను తయారు చేశాడు. తెరచాపగుడ్డపీలికతో ఒక వత్తిని తయారు చేశాడు. మట్టి ప్రమిదలో కొవ్వును ఉంచి దానిలో గుడ్డ వత్తిని పెట్టి వెలిగించాడు. అది వెలిగింది. అది ఎంతో కాంతివంతంగా లేకపోయినా నిలకడగా కొవ్వొత్తిలాగ వెలిగింది. అతనికి దీపం సమస్య తీరింది. ఆ ద్వీపంమీద దీపం వెలిగించాడు.

## అధ్యాయము - 5

ఆ ద్వీపం మీద అడవి గొర్రెలు ఎక్కువగా ఉండడంవల్ల క్రూసో వాటినే వేటాడి తినేవాడు. కొన్నాళ్ళకు గొర్రె మాంసం అంటే అతనికి విసుగు పుట్టింది. తన ఆహారంలో మార్పు అవసరం అనిపించింది అతనికి. ఎదురుగా అతనికి సముద్రం ఉండనే ఉంది. అతడు సముద్రంలోని చేపలను వేటాడి, సముద్రతీరాన్న తాబేళ్ళను పట్టుకొని వాటిని కాల్చుకొని తినడం ప్రారంభించాడు. ఆహారంలో మార్పులు రావడంతో అతనికి ఎంతో తృప్తి కలిగింది.

ఓడలోనుండి తీసికొచ్చిన సంచులను ఒకనాడు అతడు విప్పి చూస్తే అతనికి కొన్ని సంచులలో గోధుమలు, బార్లీ గింజలు కనబడ్డాయి. ఒక సంచీలో అతనికి తుక్కు కనబడింది. ఆ సంచీని తన ఇంటిముందు దులిపి దాచాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు వర్షాకాలం వచ్చింది. వర్షాలకు తన ఇంటిముందు పచ్చగా లేచిన గోధుమ మొక్కలు అతనికి కనబడ్డాయి. అవి ఎన్నో లేవు. పది పన్నెండు మాత్రమే ఉన్నాయి. అవి కొన్నాళ్ళకు వెన్నులు వేశాయి. ఆ తొలి పంటలో వచ్చిన గోధుమలను క్రూసో భద్రపరిచి వాటిలో కొన్నింటిని నేల శుభ్రం చేసి వేశాడు. కాని సకాలంలో వేయనందున అవి సరిగా మొలకెత్తలేదు. అందువలన మిగిలినవాటిని సకాలంలో వేశాడు. అవి బాగా లేచాయి. పంట బాగా పండింది. ఆ పంటలో వచ్చిన గోధుమలను మరుసటి సంవత్సరం సకాలంలో వేశాడు. ఈ విధంగా ఏటేటా సకాలంలో గోధుమ పంటను పండించడం వల్ల నాలుగైదు సంవత్సరాలలో అతనికి సంవత్సరానికి తగినంత పంట పండుతూ వచ్చింది.

ఒకనాడు తన ఇంటిముందు కూర్చొని క్రూసో వడ్రంగి పని చేసికొంటూ ఉండగా అతనికి నేల కదులుతున్నట్టు అనిపించింది. ఇంతలో కొండమీదినుంచి మట్టి పెల్లలు కిందికి పడ్డాయి. ఇంటిలో పాతిన రాటలు విరిగి పడ్డాయి. భూకంపం వచ్చినట్టు క్రూసో వెంటనే గ్రహించి తత్ క్షణం నిచ్చెన వేసికొని గోడ దాటి ఆరు బయటకు వచ్చాడు. కొండకు చేరువలో ఉంటే అది విరిగి తన మీద పడవచ్చునన్న భయంతో అతడు సముద్రతీరానికి పరుగెత్తాడు.

ఆ భూకంపానికి కొండమీదినుండి కొన్ని పెద్ద రాతి బండలు దొర్లుకొంటూ వచ్చి సముద్రతీరాన్ని చేరుకొన్నాయి. ఆ రాతిబండల చప్పుళ్ళకు క్రూసో కొన్ను నిమిషాలపాటు భయపడ్డాడు. ఈ చప్పుళ్ళకు తోడు ఈదురుగాలి విపరీతంగా వీచ సాగింది. దీంతో క్రూసోకు భయం ఎక్కువయింది. ఆ భయంతో అతడు ఇసుకలో

బోర్లాపడుకొని తన చేతులతో తన తలను కాపాడుకొంటున్నట్టు పట్టుకొన్నాడు. కొంతసేపటికి భూకంపం ఆగిపోయింది. కాని మరి కాస్సేపటికి మరి రెండు మూడు సార్లు భూమి కంపించింది. ఆకశమంతా కారు మబ్బులతో మూసుకొని పోయింది. పెనుగాలి వీచసాగింది. కొండంత ఎత్తున కెటాలు లేచి సముద్ర తీరాన్న విరుచుకొని పడజొచ్చాయి. కొన్ని పెద్ద చెట్లు కూకటి వేళ్ళతో సహా నేల కూలయి. ఉరుములు, మెరుపులతో వాన ప్రారంభమయి కుంభవృష్టిగా కురియనారంభిచింది. వాతావరణమంతా భయంకరంగా తయారయింది. ఆ గాలి వానలో సముద్రతీరాన్నే క్రూసో భయంతో కొంతసేపు గడపవలసివచ్చింది.

కొంతసేపటికి గాలివాన తగ్గింది. క్రూసో భయపడుతూనే తలదాచుకొనడానికి తన ఇంట్లోకి వెళ్ళాడు. ఆ రాత్రంతా, ఆ మర్నాడుకూడా వర్షం చలాసేపు పడింది. ఇల్లు విడిచి వెళ్ళలేక క్రూసో తన ఇంట్లోనే కాలక్షేపం చేయవలసి వచ్చింది. ఆ తుఫానుతో ఆ ప్రాంతానికి వర్షాకాలం ప్రారంభమయిందని క్రూసో ఊహించాడు.

తరచు వానలో తడుస్తూ ఉండడంవల్ల ఒకనాడు క్రూసో నిద్ర లేచేసరికి కాళ్ళూ చేతులూ పీకడం మొదలుపెట్టాయి. ఆ బాధతో అతనికి ఆ నాటి రాత్రి నిద్ర పట్టలేదు. ఆ తర్వాత కొద్ది రోజులపాటు క్రూసో తన పడకమీది నుంచి జ్వరంవల్ల లేవలేక పోయాడు. ఏ తోడూ లేకుండా ఆ స్థితిలో ఉండడంతో క్రూసోకు చాలా భయం వేసింది. జ్వరం వలన తను చనిపోవచ్చునని అతడు అనుకొన్నాడు. కాని కొన్నాళ్ళ తర్వాత ఒకనాటి రాత్రి అతనికి గాఢనిద్ర పట్టింది. ఆ మరునాడు అతనికి వంట్లో తేలికగా ఉన్నట్టు అనిపించింది. అతడు లేచి నడవగలిగాడు. మరికొన్నాళ్ళకు ఆరోగ్యవంతుడైనాడు.

క్రూసో ఆ ద్వీపంమీదకు వచ్చి పది నెలలయినా ఆ ద్వీపమంతా అతడు చూడలేదు, ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో చూడాలన్న కోరికతో ఆ ద్వీపమంతా

తిరగాలనుకొన్నాడు.

అది జులై మాసం. వాతావరణం పొడిగా ఉంది. అదే అనువైన కాలమని క్రూసో ఒకనాటి ఉదయం సెలయేటి గట్టు మీదుగా ఎగువకు నడచుకొంటూ వెళ్ళాడు. సెలయేటిలో నీరు కొద్దిగానే ప్రవహిస్తున్నది. సెలయేటికి ఇరుప్రక్కలా గట్ల పైని పచ్చగడ్డి ఒత్తుగా పెరిగి ఉంది. కొన్ని చెరకు మొక్కలు ఏపుగా ఎత్తుగా పెరిగి ఉన్నయి. కొన్ని చోట్ల దట్టమైన తుప్పలు పెరిగి చిట్టడవుల్లాగ ఉన్నయి.

ఎగువకు వెళ్తున్నకొద్దీ సెలయేటి వెడల్పు తగ్గుతూ వచ్చింది. ఇంకా అలా ఎగువకు వెళ్ళాడు. అక్కడ సెలయేటి నీరు తేటగా చల్లగా ఉంది. చెట్లు దట్టంగా ఏపుగా పెరిగి ఆ ప్రదేశం ఒక అడవిలాగ ఉంది. అక్కడ రకరకాల పండ్లు చెట్లకు వ్రేలాడు తున్నయి. పండ్ల బరువుకు కొన్ని చెట్ల కొమ్మలు నేలను తాకుతున్నయి. చెట్లమీదకు ఎగబ్రాకిన ద్రాక్షతీగలకు ద్రాక్ష పండ్లు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. నేల మీద లెక్కలేనన్ని కర్బూజా పండ్లున్నాయి. అన్ని రకాల పండ్లను చూసేసరికి అతనికి నోరు ఊరడం మొదలు పెట్టింది. ఎంతో సంతోషంతో సాయంత్రంవరకు కావలసినన్ని పండ్లను తింటూ ఆ చెట్ల నీడను తిరిగాడు. అతనికి ఆ ఆనందంలో సూర్యుడు అస్తమించడంకూడా తెలియలేదు. చీకటి పడుతూ ఉండగా క్రూసో అక్కడే ఒక పెద్ద చెట్టు ఎక్కి నిద్రపోయాడు.

ఆ మరునాడు ఉదయం క్రూసో మరి నాలుగు మైళ్ళు ఎగువకు వెళ్ళాడు. అతడు అడవి దాటి లోయలోనికి వెళ్ళాడు. ఆ లోయంతా పచ్చికతో, విరబూసిన రకరకాల పూల మొక్కలాతో ప్క ఉద్యానవనంలాగ అతనికి కనబడింది. ఆ ప్రకృతి సౌందర్యాన్ని అతడు చూసి పరవశించి తనని తాను మరచి పోయి అలా చూస్తూ నిలబడ్డాడు.

అతనికి ఇరుప్రక్కలా రెండు కొండలున్నాయి. ఒక ప్రక్కనుండి సెలయేరు తూర్పువైపుగా ప్రవహిస్తున్నది. ఆ ప్రదేశాన్నంతా క్రూసో ఒకసారి కలియజూసి "ఈ ప్రదేశమంతా నాది. ఈ సౌందర్యమంతా నాది. నా హక్కును కాదనే వారు ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ రాజ్యానికి నేనే రాజును" అని తనలో తనే అనుకొన్నా బిగ్గరగా పైకే అన్నాడు.

క్రూసో మూడు రోజులు కాలినడకను తన ప్రయాణాన్ని సాగించాడు. తర్వాత ఇల్లు చేరుకొన్నాడు. కొన్ని కమలా పండ్లను, కొన్ని ద్రాక్షపండ్లను క్రూసో ఇంటికి తీసికొని వెళ్ళాడు. కాని ద్రాక్షపండ్లు పాడయినాయి.

ఆ మర్నాడు క్రూసో రెండు సంచులను తీసికొని వెళ్ళి వాటినిండా కమలా పండ్లను తెచ్చుకొన్నాడు. ద్రాక్షపండ్లు ఎండు ద్రాక్షలు అవాలని వాటిని చెట్లమీదనే వదిలి పెట్టాడు. ఏవేవో పండ్లు ఆ అడవి ప్రాంతమంతా నేలమీద పడి ఉన్నాయి. వాటిలో చాలా వాటిని ఏవో సగం కొరికి వదిలిపెట్టాయి. వాటిని కొరికినవి జంతువులో, పక్షులో క్రూసోకు తెలియ లేదు.

ఆ సౌందర్యవంతమైన అడవి ప్రాంతం క్రూసోకు ఎంతో నచ్చింది. అందువల్ల వీలైనంత ఎక్కువ కాలం అక్కడ గడపాలనుకొన్నాడు. గాని దానివల్ల అతనికి నష్టం కలుగ వచ్చును. ఎక్కువ కాలం అక్కడే ఉంటే సముద్రం అతనికి కనబడదు. అదృష్టవశాత్తూ ఏదైనా ఓడ ద్వీపానికి చేరువగా వస్తే అతనికి అది కనబడదు. స్వదేశం చేరుకొనే అవకాశం అతనికి అనవసరంగా పోతుంది. కనుక అప్పుడప్పుడు వచ్చి ఆ ప్రంతంలో సరదాగా గడపదలచుకొన్నాడు క్రూసో. అందుకోసమని అక్కడ ఒక చిన్న ఇల్లు కట్టుకొన్నాడు. దాని చుట్టూ ఒక గట్టి గోడను కట్టాడు. ఆ ఇంటికి "వన విహార్" అని పేరు పెట్టాడు. తన పాత ఇంటికి "సాగర దృశ్యం" అని నామకరణం చేశాడు."

సెలయేటికి చేరువలోనున్న ఆ అడవి ప్రదేశమంతా చాలా సారవంతమైనది గనుక అక్కడ కొంత నేలను శుభ్రం చేసి, బాగా తవ్వి, రెండు మళ్ళను తయారు చేశాడు. ఒక మడిలో గోధుమలు, రెండవ మడిలో బార్లీ గింజలు జల్లి నీరు పెట్టాడు. అవి మొలకలు ఎత్తి వెన్ను వేసే సమయానికి ఆ మళ్ళ చుట్టూ అతడు కంచె వేశాడు. కంచె వేయకపోతే అడవిగొర్రెలు వచ్చి చేలను నాశనం చేస్తాయని అతనికి తెలుసు. పగటిపూట పక్షులు వచ్చి నాశనం చేయడం మొదలు పెట్టాయి. అందుకని అతడు పగటిపూట చేలకు కపలా కాయవలిసి వచ్చింది. రోజంతా అతనికి వృధా కావచ్చింది. అందుకని అతడు కొన్ని పక్షులను చంపి చేలలో అక్కడక్కడ రాటలకు వేలాడవేశాడు. ఆ చచ్చిన పక్షులను చూసి ఇతర పక్షులు చేలమీదకు రావడం మానివేశాయి. క్రూసో కష్టపడినందుకు అతనికి తగిన ప్రతిఫలం దక్కింది. గోధుమ, బార్లీ పంటలు బాగా పండాయి.

వర్షాకాలంలో ఇల్లు విడిచి ఎక్కువసేపు బయటకు వెళ్ళడానికి క్రూసోకు వీలుండేది కాదు. అందుకని అతడు సన్నని, మెత్తని చెట్లకొమ్మలను నరికి తీసికొని వచ్చి బుట్టలు అల్లడం ప్రారంభించాడు. మొదట్లో ఆ బుట్టలు అంత బాగుండకపోయినా తన అవసరానికి పనికి వచ్చాయి. కొన్నాళ్ళకు అతనికి బుట్టలు అల్లడంలో నేర్పు వచ్చింది.

వండుకొని తినడానికి తగిన పాత్రలు అతని వద్ద లేవు. మంచి నీళ్ళు నిలవచేసికొనడానికైనా పాత్రలు అతనికి అవసరం. కాని అతని వద్ద ఏ పాత్రలూ లేవు. కనీసం మట్టిపాత్రలు ఉన్నా అతని అవసరం గడుస్తుంది. కుండల్ని తయారుచేయడం అతనికి తెలియదు.

కుండలను తయారుచేడానికి బంక మన్ను కావాలి. సారె లేకపోయినా కష్టపడి చేత్తో కుండలను తయారు చేయవచ్చును. అలా తయారు చేసిన వాటిని

ఆరబెట్టాలి. అవి గట్టి పడినంతమాత్రాన అవి వినియోగపడవు. వాటిని కాల్చాలి. ఇదంతా క్రూసోకు తెలియదు. కాని అనుకోకుండా కుండలను తయారుచేయడంఅతడు తెలిసికొన్నాడు.

ఒకనాడు అతను గొర్రె మాంసం కాల్చుకొంటున్నప్పుడు ఒక మట్టి ప్రమిద మంటలో కాలి ఎర్రగా తయారవడం చూశాడు. అతని అనందానికి అంతు లేకపొయింది. వెంటనే అతడు బంక మన్నుతో కొన్ని మట్టి పాత్రలను తయారుచేసి ఆరబెట్టి ఆ రాత్రి వాటిని వామిలో కాల్చాడు. ఆ పాత్రలు బాగా కాలి గట్టిగా తయారయినాయి. అవి ఆకారంలో అందంగా లేకపోయినా తన అవసరాలకు బాగా ఉపయోగపడ్డాయి.

క్రూసో తొడుగుకొంటున్న బట్టలు బగా చిరిగిపోసాగాయి. కొత్త బట్టల అవసరం అతనికి కలిగింది. పంట్లాలు వేస్ట్ కోట్లు అతనికి అత్యవసరమైనాయి. నూలు బట్టలు తయారు చేసికొనే అవకాశం అతనికి లేదు. ఉన్ని వస్త్రాలు తయారు చేసికొనే అవకాశం అతనికి ఉన్నా అతనికి వాటిని తయారుచేయడం తెలియదు. అందువల్ల అతడు చంపిన గొర్రెల చర్మాలతోనే బట్టలను తయారుచేసికొనదలచాడు. దర్జీ పనిలో తన నేర్పును తెలిసికొనవలసిన సమయం ఆసన్నమైనదని అతడు అనుకొన్నాడు.

ముందుగా అతనొక బొచ్చు టోపీని తయారు చేశాడు. అది తన తల ఆదికి మించి వదులుగా, పెద్దదిగా తయారయింది. తర్వాత ఒక జత బట్టలు కుట్టుకొన్నాడు. అవి కూడా వదులుగానే తయారయినాయి. ఆ ద్వీపం మీద ఎండవేడి ఎక్కువ గనుక వదులుగా ఉండే బట్టలను తొడుగుకొనడం మంచిదని తనని తాను సమర్ధించుకొన్నాడు. తన బట్టలు ఎలాగున్నా తనను మెచ్చుకొనే వారు గాని, వెక్కిరించే వారు గాని ఆ ద్వీపం మీద ఎవరూ లేరు కనుక తన అవసరం

తీరితే చాలు అనుకొన్నాడు క్రూసో. అవసరాన్నిబట్టి తెరవడానికి, మూయడానికి వీలుగా ఉండే ఒక గొడుగును తోలుముక్కలతో అతడు తయారు చేసికొన్నాడు.

## అధ్యాయము - 6

రాబిన్సన్ క్రూసో ఇన్నాళ్ళూ ఆ ద్వీపంలో ఒక వైపునే ఉంటూవచ్చాడు. రెండవ వైపు ఎలాగ ఉందో చూడాలన్న కోరిక అతనికి కలిగింది. ఒకనాడు అతడు ఒక తుపాకీని చేతపుచ్చుకొని, ఆహారపదార్థాలతో ఒక సంచీని భుజానికి తగిలిచుకొని తన కుక్కతోగూడా ఆ ప్రాంతాన్ని చూడాలని బయలుదేరాడు.

అతడు నడచుకొంటూ ద్వీపానికి రెండవ వైపున నున్న సముద్ర తీరాన్ని చేరుకొన్నాడు. అక్కడ చాలా తాబేళ్ళు, అనేక రకాలైన పక్షులు, చేరువుగా అడవి ప్రంతంలో మందలు మందలుగా పరుగెత్తుతూ అడవి గొర్రెలు అతనికి కనిపించాయి. అతడు నివసిస్తున్న ప్రాంతంలో అతడు ఎప్పుడూ ఇన్ని తాబేళ్ళను, పక్షులను, గొర్రెలను చూడలేదు. ఈ ప్రాంతంలో నివసిస్తే పుష్కలంగా ఆహారం దొరుకుతుందన్న ఆశ అతనికి కలిగినా, ఏదైనా ఓడ ఆ ద్వీపానికి చేరువగా వస్తే తను ప్రస్తుతం నివసిస్తున్న వైపుకే వస్తుందన్న నమ్మకం ఉండడం వలన ఈవైపున అతను నివసించదలచుకొనలేదు.

ఆ ప్రదేశమంతా పరిశీలిస్తూ కాలినడకను పదిపన్నెండు మైళ్ళు ఆ తీరం వెంబడి వెళ్ళాడు. తర్వాత వెనుకకు పోదలచాడు. తను వెనుకకు మరలిన చోట గుర్తుగా ఒక రాటను పాతాడు. ఈ సారి అతడు రెండవవైపునుండి ఆ రాట వరకు రాదలచాడు.

క్రూసో మరలి వస్తున్నప్పుడు ఆ తీరానికి సుమారు ఇరవై మైళ్ళ దూరంలో మరొక ద్వీపం ఉన్నట్టు అతనికి కనిపించింది. వీలైనంత త్వరలో ఆ ద్వీపానికి

వెళ్ళాలనుకొన్నాడు. ఈ ఒంటరి బ్రతుకునుండి విముక్తి పొందాలన్న వాంఛ అతని మనస్సులో ఎప్పుడూ ఉంటూనే ఉంది.

దూరంగా కనబడుతున్న ఆద్వీపాన్ని చరుకొంటే తన స్వదేశమైన ఇంగ్లండ్ చేరుకొనే అవకాశం లభిచవచ్చునని అతని ఆశ. పెద్ద పడవ ఒకటి మంచిది ఉంటే అందులో ఎలాగైనా ఆ ద్వీపానికి వెళ్ళ వచ్చు ననుకొన్నాడు. కాని అదే లేదు. కనుక తానే ఒక మంచి పడవను తయారుచేసికొనాలని నిర్ణయించుకొన్నాడు.

"అయితే పడవను ఎలా తయారు చేయాలి ? ఇంతకు తను ఒక పడవను తయారుచేస్తే అది సముద్రయానానికి పనికి వస్తుందా ?" అన్న అలోచనైనా లేకుండా ఆ మర్నాడే తన పని ప్రారంభించాడు.

"సాగరదృశ్యా"నికి చేరువలో సముద్రతీరం వైపునున్న ఆరు అడుగుల మందం గల ఒక చెట్టును అతడు ఎంచుకొన్నాడు. కొన్నాళ్ళకు కష్టపడి దానిని గొడ్డలితో నరికి పడగొట్టాడు. ఒక నెల రోజులు శ్రమపడి దానిని పడవ ఆకారంలో చెక్కాడు. తర్వాత దానిలో తొట్టిని దొలిచాడు. మొత్తం మీద నాలుగు నెలలలో ఒక పడవను తయారు చేశాడు. కష్టపడి తయారు చేసినందుకు అది చక్కగానే తయారయింది. తన నేర్పుకు తనే మురిసిపోయాడు.

సముద్రానికి నూరు గజాల దూరంలో ఆ పడవ తయారయి ఇసుకలో ఉంది. తానొక్కడు దానిని నీటిలోనికి లాగుకొని పోలేడు. దానిని ఎలాగైనా నీటిలోనికి తీసికొని వెళ్ళాలి. ఉపాయాలు ఆలోచించసాగాడు. పడవను నీటిలోనికి తీసికొని వెళ్ళే అవకాశం లేదని అతడు గ్రహించాడు. సముద్ర జలాన్నే పడవ వద్దకు ఎందుకు తీసికొని రాకూడదనుకొన్నాడు. అది అతనికి అసాధ్యం కాదనిపించింది. వెన్వెంటనే అతడు సముద్రతీరం నుండి పడవ వరకు ఒక కాలువను త్రవ్వనారంభించాడు.

ఎంతో శ్రమపడి ఆరడుగుల వెడల్పున నాలుగు అడుగుల లోతున కాలువను కొన్ని నెలల్లో త్రవ్వ గలిగాడు క్రూసో. అతని పడవ ఆ కాలువ నీటిలో తేలియాడుతూ కనబడే సరికి ఆ సంతోషంతో తను పడిన శ్రమను మరచిపోయాడు.

ఆ పడవకు క్రూసో ఒక తెరచాపను అమర్చాడు. గట్టి కర్ర చెక్కలతో రెండు తెడ్లను తయారు చేశాడు. ఒక బరువైన ఇనుప ముక్కతో ఒక లంగరునుకూడా ఏర్పరచాడు. పడవకు ముందున, వెనుకను తొట్టెలో రెండు పెట్టెలను బిగించాడు. వాటిలో ఆహారపదార్థాలను, పిస్తోళ్ళను, మందుగుండు మొదలైన సామానులను చెమ్మ తగలకుండా జాగ్రత్తగా పెట్టాడు. పడవ లోపలి అంచుకు దిగువగా చెక్కను దొలిచి అందులో ఒక రైఫిల్ను పెట్టి దానిపైని ఒక అట్టను అంటించాడు. తెడ్డు వేయడానికి కూర్చునే చోట తనకు ఎండ తగలకుండా ఉండడానికి తన గొడుగును అమర్చాడు. తన ఏర్పాట్లన్నీ చూసికొని తను ఇంగ్లండ్ ఆ పడవలో వెళ్తున్నట్టే ఊహించాడు.

ఆ ద్వీపానికి అతడు వచ్చి అప్పటికి ఆరేళ్ళయింది. అది నవంబర్ మాసం. సముద్రయానానికి అది అనుకూలమైన కాలం. కనుక ముందుగా తన పడవ సముద్రయానానికి నిలుస్తుందో లేదో పరీక్షచేయ దలచుకొన్నాడు. తన పరీక్షకు ఆ పడవ నిలిస్తే ప్రయాణానికి ఏర్పాట్లు వెంటనే చేసికోదలచుకొన్నాడు.

ముందుగా ఆ పడవలో ఒకసారి ఆ ద్వీపం చుట్టూ తిరిగి రావాలనుకొన్నాడు. ఆ పడవలో పశ్చిమ దిక్కుగా తీరం వెంబడి బయలుదేరాడు. కొద్దిదూరం అతడు వెళ్ళాడో లేదొ అతనికి కొన్ని రాళ్ళ బండలు అడ్డు వచ్చాయి. వాటిలో కొన్ని బండలు నీటి మట్టానికి పైనా, కొన్ని నీటి మట్టానికి అడుగున ఉన్నాయి. వీటిని పడవ ఢీకొని బోల్తా పడే అవకాశముంది. ఏమి చేయాలో అతనికి వెంటనే తోచలేదు.

"ఒడ్డుకు దూరంగాపడవను సముద్రంలోనికి తీసికొని వెళ్ళి చివరి బండను చుట్టి రావడమా? లేక వీలయినచోట బండలను తప్పించుకొంటూ తీరం వెంబడి వెళ్ళడమా?" అని అతడు కాస్సేపు అలోచించాడు. తీరానికి దూరంగా తీసికొని పోతే తన పడవ నిలుస్తుందన్న నమ్మకం అతనికింకా కుదరలేదు. అందువల్ల బండల మధ్య ఏదైనా తోవ కనబడుతుందేమోనని అతడు పరిశీలించాడు. బండలు అడ్డుగా లేని సన్నని మార్గం ఒకటి అతనికి గోచరించింది. పడవను అటువైపు మళ్ళించాడు. బండల మధ్యకు పడవ ప్రవేశించగానే అది నీటి వరవడిలో పడి అతని అధీనంలో లేకుండా తీరానికి దూరంగా కొట్టుకొని పోసాగింది. అతడు ఎంత ప్రయత్నిచినా ఒడ్డుకు రాలేకపోయాడు. క్షణ క్షణానికి అతడు ఒడ్డుకు దూరమవుతున్నాడు. ఆ సమయంలో గాలి కూడా అతనికి ప్రతికూలంగానే వీచింది. ఏ క్షణాన్నయినా పడవ బోల్తా పడవచ్చునని అతడు భయపడ్డాడు. బ్రతికి బయటపడే ఆశ అతనికి ఆడుగంటింది.

నిమిష నిమిషానికి రాబిన్సన్ క్రూసో తీరానికి దూరమవుతూ కొన్ని మైళ్ళ దూరం సముద్రంలోకి వెళ్ళాడు. ఇంతలో అస్తమించడానికి పశ్చిమ దిశను సూర్యుడు సిద్ధంగా ఉన్నాడు. క్రూసోకు భయం ఎక్కువయింది. కాని ఇంతలో గాలివాటు తీరంవైపు మళ్ళింది. రానురాను గాలి వేగం హెచ్చయింది. అతడు వెంటనే తెరచాపను ఎత్తేడు. గాలి వేగానికి పడవ అతి వేగంగా ద్వీపాన్ని చేరుకొంది. క్రూసో ప్రాణాలు తేలిక పడ్డాయి. క్రూసో పడవను ఒక చెట్టుకు కట్టి ఇసుకలో మోకాళ్ళపైని కూర్చొని తనను కాపాడినందుకు దేవునికి కృతజ్ఞతలు తెల్పుకొన్నాడు.

ఆందోళన వల్లను, శ్రమ వల్లను క్రూసో అప్పటికే చాలా అలసిపోయాడు. అక్కడనుండి కదలలేక ఉన్నచోటనే ఇసుకలో పడుకొని ఒడలు మరచి నిద్రపోయాడు. ఆ మర్నాటి ఉదయానికి గాని అతనికి మెలకువ రాలేదు. లేవలేక

లేవలేక అతి కష్టం మీద అతడు లేచికూర్చొని చుట్టూ కలియ జూశాడు. అతడు ఏ ప్రాంతంలో ఉన్నదీ, అక్కడనుండి తన పడవ ప్రయాణం ఎటుసాగించాలో అతనికి తెలియలేదు. అతనికి తూర్పు దిక్కున సముద్రంలో రాళ్ళబండలు కనిపించాయి. క్రితం రోజున ఆ రాతి బండలు పెట్టిన కష్టాలు జ్ఞప్తికి వచ్చాయి. అక్కడ నుండి తన ప్రయాణాన్ని పడమటివైపు సాగించదలచాడు. ప్రస్తుతం తను ఉన్న ప్రాంతాన్ని పరిశీలించదలచి అక్కడకు చేరువలో నున్న ఒక ఇసుక దిబ్బను ఎక్కి చూశాడు.

ఆ ప్రదేశాన్ని లోగడ ఒకసరి చూసినట్లు అతనికి అనిపించింది. కాస్సేపు ఆలోచించగా లోగడ ఒకసారి తన "వన విహార్" నుండి ఆ ప్రదేశానికి వచ్చినట్లు జ్ఞప్తికి వచ్చింది. తను లోగడ పాతిన రాట అతనికి కనిపించి ఆ విషయం నిజమని రుజువు చేసింది.

"వన విహార్" అక్కడకు దూరంగానే ఉన్నా అతడు ఒక రైఫిల్ ను చేత పుచ్చుకొని గొడుగు వేసికొని అటువైపు వెళ్ళాడు. సాయంత్రానికి అతడు "వన విహార్" చేరుకొన్నాడు. అతడు ఇల్లు చేరుకొనే సరికి ఎండలో నడవడంవల్ల బాగా అలసి పోయాడు. గోడ దాటి ఇంట్లో ప్రవేశించి ఇల్లంతా చూశాడు. అతడు ఎలాగ వదిలిన వస్తువులు అలాగే ఉన్నాయి. ఇంతలో చీకటి పడింది. పడుకొనగానే అలసటవల్ల గాఢ నిద్రపట్టింది

అతనికి మంచి నిద్రలో మెలకువ వచ్చింది. ఇల్లంతా చాలా చీకటిగా ఉంది. ఆ చీకట్లో ఎవరో అతన్ని "క్రూసో ! క్రూసో !" అని పిలిచినట్లనిపించింది. అతనికి భయం వేసింది. అది కల అనుకొన్నాడు. ఇంతలో "క్రూసో ! ఎక్కడ ఉన్నావ్ రాబిన్సన్ ? ఎక్కడికి వెళ్ళావ్ క్రూసో ?" అన్న మాటలు వినబడ్డాయి. అతనికి ఆశ్చర్యం వేసింది. అతన్ని ఆ ద్వీపంమీద అంత చనువుగా పిల్చేవారు ఎవరున్నారు ? ఈ ఆలోచనలకు అతనికి నిద్రమత్తు వదిలిపోయింది. ఇంతలో మళ్ళా అవే మాటలు

వినబడ్డాయి. తనను అలా ఎవరు పలకరిస్తున్నారో అతడు అప్పుడు గుర్తించాడు. అలా తనను పిలిచినది ఎవరో కాదు,తను పెంచుకొంటున్న రామచిలుక ! తన రామచిలుక తనని వెతుక్కొంటూ "సాగరదృశ్యం" నుండి ఈ "వనవిహార్"కు వచ్చింది. తన యజమాని కోసం అది ఎంత ఆరాటపడి వెతికిందో గదా !

క్రూసో "వనవిహార్"లో మూడు రోజులు ఉండి తర్వాత నడచుకొంటూ "సాగరదృశ్యం" చేరుకొన్నాడు.

సముద్రంలోని ఆటుపోటులను శ్రద్ధగా గమనిస్తే తన పడవమీద ఆ ద్వీపంచుట్టూ సురక్షితంగా తిరిగి రావచ్చునన్న ఆలోచనతో అతను ఒకనాడు బండల తీరానికి ఉదయమే వెళ్ళి కూర్చున్నాడు. సాయంత్రం వరకు సముద్రపు ఆటు పోటులను గమనించాడు.

## అధ్యాయము - 7

గొర్రెలను, పక్షులను తన తుపాకులతో వేటాడుతున్న కొద్దీ క్రూసో వద్ద మందుగుండు తరిగిపోతూ వచ్చింది. తనవద్ద నున్న మందుగుండు పూర్తిగా అయిపోతే తన తుపాకులకు మరి పని ఉండదు. "ఎవరైనా శత్రువులుగాని, ఏవైనా క్రూర మృగాలుగాని నన్ను ఎదుర్కొంటే నాగతేంకాను ?" అని క్రూసో అలోచించసాగాడు.

అడవి గొర్రెలను వేటాడి చంపి తినడంకన్నా వాటిని పట్టుకొని, పెంచి అవసరమైనప్పుడు చంపి వండుకొని తినడం మంచిదని క్రూసో నిర్ణయించుకొన్నాడు. కాని వాటిని ఎలాగ పట్టుకొనడం ? తను కనబడితేనే అవి జడిసి పరుగెత్తి పారిపోతున్నాయి. వాటిని పట్టుకొనడానికి ఉపాయం ఆలోచించసాగాడు.

అడవి గొర్రెలు తరచుగా మేత కోసం వచ్చే ప్రదేశం అతనికి తెలుసు. అక్కడ

ఒక లోతయిన పెద్ద గొయ్యిని అతడు త్రవ్వాడు. ఆగోతిపైని సన్నని కట్టె పుల్లలను పేర్చి వాటిపైని మట్టిని పోశాడు. ఆ మన్ను కనబడకుండా ఆకులతో కప్పాడు. తర్వాత వాటిపైని గోధుములను కుప్పగా పోసి, చెట్టు ఎక్కి మాటువేశాడు.

కొన్ని గొర్రెలు పచ్చగడ్డిని మేస్తూ అటు వచ్చాయి. వాటిలో రెండు పెద్ద గొర్రెలు, మూడు గొర్రె పిల్లలు గోతిమీది గోధుమలు చూసి తినడానికి ఆశతో వచ్చి గోతిలో పడ్డాయి. పెద్ద గొర్రెలను మచ్చిక చేసికొనడం సాధ్యంకాదని క్రూసో వాటిని చంపి విందు చేసికొన్నాడు. గొర్రెపిల్లలను పట్టుకొని వాటిని తన ఇంటి ముందు ఒక చెట్టుకు కట్టాడు. వాటికి రోజూ మేత పెడుతూ వాటిని మచ్చిక చేసికొన్నాడు. అతని వద్ద ఇప్పుడు నాలూగు గొర్రె పిల్లలు ఉన్నాయి.

"సాగరదృశ్యం" చేరువలో ఒక పచ్చిక మైదానం ఉంది. ఆ మైదానం చుట్టూ అతడు ఒక ఎత్తయిన కంచె వేశాడు. ఆ ఆవరణలో ఆ నాలుగు గొర్రెపిల్లలను అతడు వదిలి పెట్టాడు. అక్కడ అవి స్వేచ్ఛగా కావలసినంత పచ్చికను మేస్తూ అక్కడ ఉన్న చెట్ల నీడను విశ్రాంతి తీసికొంటూ ఉండేవి. వాటికి నీటి వసతి కూడా అతడు ఏర్పరచాడు. రోజూ అతడు వాటితో కాస్సేపు కాలక్షేపం చేస్తూ ఉండేవాడు.

రెండేళ్ళు గడిచేసరికి, వండుకుతిన్న గొర్రెలు పోగా అతడు నలభై మూడు గొర్రెలకు అధిపతి అయ్యాడు. ఆ గొర్రెలు తన అవసరానికి మించినన్ని పాలను ఇచ్చేవి. త్రాగగా మిగిలిన పాలతో అతడు వెన్నా, నెయ్యీ, జున్నూ తయారు చేసికొని తింటూ ఉండేవాడు.

పడవ మీద వెళ్ళి గండం తప్పి ప్రాణాలతో సముద్రంలోనుండి బయట పడ్డ తర్వాత అతడు ఇంగ్లండ్ ప్రయాణం గురించి అలోచించడమే మానివేశాడు. ఆ ద్వీపం మీద తన ఒంటరి జీవితాన్ని వీలయినంతవరకు సుఖమయం చేసికొనడానికే

అతడు నిశ్చయించుకొన్నాడు. ఆ దృష్టితోనే కృషి చేయదలచుకొన్నాడు.

గోధుమ పంట సమృద్ధిగా పండు తున్నది.అయినా అతడు గోధుమ రొట్టెలను తిని చాలా రోజులయింది. గోధుమ పిండితో రొట్టెలను తయారు చేసికొనాలన్న తలంపు అతనికి కలిగింది. కాని గోధుములను ఎలా పిండి కొట్టడం ? ఆలోచిస్తే సాధించ లేని కార్య ముండదు. ఒక గట్టి మానును రోలు ఎత్తున కోసి దాని మధ్యను నిప్పులు పోసి కాల్చి గుంటను ఏర్పరచి ఒక రోలును అతడు తయారు చేశాడు. ఒక కర్ర రోకలిని తయారుచేసి గోధుములను పిండి కొట్టాడు. ఆ పిండిని ఒక పాత గుడ్డలో వేసి వస్త్ర కాళం చేసాడు. పిండి సిద్ధమయింది కాని రొట్టెలను కాల్చడానికి రొట్టెల పొయ్యి లేదు. ఆలోచిస్తే అసాధ్యమయినది లేదుకదా ?

కుండలను తయారు చేసినట్టే రెండు రొట్టె అచ్చులను అతడు మట్టితో తయారు చేసి కాల్చాడు. రెండు రాతి పలకల మీద పెద్ద మంట పెట్టాడు. నీళ్ళతో గోధుమ పిండిని ముద్దగా కలిపి అచ్చులో వేశాడు. ఎర్రగా కాలిన రాతి పలకపైని ఈ అచ్చులను పెట్టి వాటి మీద ఒక కుండను బోర్లించి దాని చుట్టూ మంట పెట్టాడు. కొంతసేపయిన తర్వాత కుండను తీసి చూశాడు. ఎర్రగా కాలిన రొట్టెలు అచ్చుల్లో కనబడ్డయి. సంతోషంతో క్రూసో ఎగిరి గంతు వేశాడు. ఆ రొట్టెలను గొర్రెమాంసం కూరతో తింటూ ఉంటే అతనికి పండగ అనిపించింది.

ఒంటరి జీవితమే అయినా రొట్టె, పాలు, వెన్న, జున్ను, మాంసం, పండ్లు మొదలైన ఆహారపదార్థాలు క్రూసోకు సమకూరేయి. సొంత ఇల్లుంది. ఇల్లేమిటి ఆద్వీపమే అతని సొంతం. ఏపని ఎప్పుడు చేసినా అతన్ని అడిగేవారు లేరు. అతడు స్వేచ్ఛా జీవి. మొత్తంమీద ఆ ద్వీపంలో అతని జీవితం ప్రశాంతంగానే గడిచిపోతున్నది. కాని అతనికి ఒకే దిగులు. అది తను మళ్ళా మనుష్య ప్రపంచంలోనికి వెళ్ళే అవకాశం లేదేమోనని.

తన పడవ ఉన్నచోటికి వెళ్ళాలని అతనికి ఒక నాడు అనిపించింది. తన గొర్రె చర్మం దుస్తులు ధరించి బొచ్చు టోపీ పెట్టుకొన్నాడు. తన వింత గొడుగును పట్టుకొని కాళ్ళకు చెప్పులు లేకుండా బయలుదేరాడు. అతని వేషం ఎలా ఉన్నా అతన్ని చూసి నవ్వేవారు అక్కడ ఎవరూ లేరు.

అతని తలమీది టోపీకి సరియైన ఆకారం లేదు. దాని వెనుక అంచు మెడ మీదకు వేళ్ళాడుతూ ఉంది. వేస్ట్ కోటు నడుందాటి తొడలమీద జీరాడుతూఉంది. పంట్లాం మోకాళ్ళవరకే ఉంది. అది పొట్టి పంట్లామో పొడుగు నిక్కరో చెప్పడం కష్టం. నడుముకు కట్టుకొన్న తోలు బెల్టులోనుండి ఒక గొడ్డలి, ఒక రంపం వ్రేలాడుతున్నాయి. భుజం మీదనుండి నడుముకు అడ్డుగా కట్టుకొన్న క్రాస్ బెల్టు సంచుల్లో మందుగుండు నిండుగా ఉంది. వీపు మీద ఆహారపదార్థాల బుట్ట ఉంది. భుజంమీది నుండి ఒక రైఫిల్ వేలాడుతూఉంది. ఈ వేషానికి తోడు తన వింత గొడుగును వేసికొని బయలుదేరాడు.

అతడు తన పడవ వద్ద కాస్సేపు కూర్చొని, సముద్రంలోని ఆటుపోటులను పరిశీలించి, ఇంటికి బయలు దేరాడు. అతడు మెల్లగా అడుగులు వేసికొంటూ ఆలోచిస్తూ కిందకు చూస్తూ నడుస్తూ ఒక్కసారి ఆశ్చర్యంతో ఆగిపోయాడు. ఆశ్చర్యంతోపాటు అతనికి భయం కూడా కలిగింది. చలనం లేకుండా రాతి బొమ్మలా నోరు తెరచుకొని నిలబడి పోయాడు.

కొంతసేపటికి క్రూసో తేరుకొని చుట్టూ కలియజూశాడు. చెవులను నిక్కించి విన్నాడు. అతనికి కొత్తది ఏదీ కనబడలేదు. సముద్రం హోరు తప్ప వేరొక శబ్దం వినబడలేదు. అతడు తన కళ్ళ ముందు తడి ఇసుకలో ఉన్న పాదముద్రను పరిశీలిస్తూ ఉండి పోయాడు. అది మనుష్యుని పాదముద్ర. ఆ ముద్ర అక్కడ ఎలా పడింది ? అది ఎవరి పాద ముద్ర ? ఈ ప్రశ్నలకు అతనికి సమాధానం దొరకలేదు.

ఆ పాదముద్రను అలా చూస్తున్న కొద్దీ అతనికి భయం ఎక్కువ కాసాగింది.

అతనికి ఎదురుగా కాళ్ళముందు ఒకే ఒక పాదముద్ర ఉంది. ఇంకా మరికొన్ని పాదముద్రలు కనబడవచ్చునని ఆ సముద్ర తీరాన అతడు అటూ ఇటూ తిరిగి చూశాడు. కాని పాదముద్రలు ఏవీ కనబడలేదు. ఇంతకూ అతడు చూసింది పాదముద్ర అవునో కాదో నన్న సందేహంతో ఆ పాదముద్ర వద్దకు మళ్ళా అతడు వెళ్ళాడు, దానిని నిశితంగా చూశాడు. సందేహం లేదు, అది మానవుని పాద ముద్రే ! తడి ఇసుకలో స్పష్టంగా కబడుతూనేఉంది. దానిని గురించి ఆలోచిస్తున్న కొద్దీ అతనికి సందేహం, అనుమానం, భయం, పిరికితనం కలుగజొచ్చయి.

ఎవడో ఒక అడవి మనిషి వేరొక ద్వీపంనుండి తన ద్వీపానికి వచ్చి ఉండాలన్న భయం ఎక్కువయింది. ఇక అక్కడ ఉండలేక మెల్లగా అడుగులో అడుగు వేసికొంటూ, ప్రతి రెండు అడుగులకూ ఒక సారి వెనక్కు తిరిగి చూస్తూ ముందుకు అడుగులు వేస్తూ మెల్లగా ఇంటివైపు నడవసాగాడు. దూరంగా అడవిలో ఉన్న ప్రతి చెట్టూ అతనికొక అడవి మనిషి లాగ కనబడసాగింది. ఏ క్షణాన్నైనా అడవి మనుష్యులు వచ్చి తన మీద పడవచ్చు నన్న భయంతో తన తుపాకీమీద చెయ్యి వేశాడు గాని దానిని తీసి మందుగుండు దట్టించలేకపోయాడు.

ఎలాగైతేనేం అతడు తన "సాగరదృశ్యం" చేరుకొన్నాడు. మూడు రోజులపాటు అతడు ఆ ఇంట్లో నుండి బయటకు రాలేదు. ఆ మూడు రోజులూ తిండి తింటున్నా, పడుకొన్నా, ఏ పని చేస్తున్నా ఆ పాదముద్ర గురించే ఆలోచించసాగాడు.

ఇంతకూ ఆ పాద ముద్ర తనదే కావచ్చునన్న అనుమానం అతనికి నాలుగవ రోజున కలిగింది. ఆ అనుమానం తీర్చుకొనడానికిగాను అతడు బిక్కు బిక్కు

మంటూనే సముద్ర తీరానికి వెళ్ళాడు. చెరిగిపోకుండా ఆ పాదముద్ర తడి ఇసుకలో ఇంకా అలాగే ఉంది. ఆ ముద్రను తన పాదంతో కొల్చి చూసికొన్నాడు. ఆ ముద్ర తన పాదానిది కాదన్న నిశ్చయానికి అతడు రాక తప్పలేదు. ఆ ముద్ర తన పాదం ఆదికన్నా పెద్దదిగా ఉంది. భయంతో మళ్ళా ఇంటి ముఖం పట్టాడు. ఆ ద్వీపం మీదకు అడవి మనిషో, మనుష్యులో వచ్చారన్నది నిజం అన్న అభిప్రాయానికి క్రూసో రాక తప్పలేదు.

తనని తాను రక్షించుకొనడానికి అతడు ఆ ద్వీపం వదిలి పోలేదు. కనుక తన ఆత్మరక్షణకు కొన్ని ఏర్పాట్లు చేసికొనడం తప్పదనుకొన్నాడు క్రూసో. తర్వాత తన ఆలోచనలను కార్యరూపంలో పెట్టసాగాడు.

తన ఇంటి చుట్టూ ఉన్న గోడకు కాపుదలగా దాని ముందున పదడుగుల ఎత్తున మరొక గోడను అతడు నిర్మించాడు. ఆ గోడకు పొడుగునా ఏడు చోట్ల ఏడు కన్నాలు పెట్టాడు. శత్రువులు ఎవరైనా తన ఇంటిని ముట్టడిస్తే వారికి కనబడకుండా ఆ ఏడు కన్నాలలో నుండి ఒకేసారి ఏడు తుపాకులను పేల్చడానికి తగిన ఏర్పాట్లనుగూడా అతడు చేశాడు. ఆ గోడ బైటవారికి కనబడకుండా ఉండాలని దాని చుట్టూ క్రూసో మొక్కలను నాటేడు. అవి త్వరలో పెద్దవయి తన ఇంటిని మరుగు పరచాయి.

తన గొర్రెలను మూడు మందలకింద విభజించి, మూడు ప్రదేశాలలో కంచెలు వేసి ఉంచాడు.

కొండమీద ఉన్న ఒక చిన్న గుహలో తన దూరదర్శినిని, ఒక రైఫిల్ ను, కొంత మందుగుండును దాచిపెట్టాడు. అక్కడ నుండి తన శత్రువుల రాకపోకలను గమనించదలచాడు.

తన ఆత్మరక్షణకోసం తను చేసికొన్న ఈ ఏర్పాట్లతో అతడు తృప్తి పడ్డాడు. ప్రతి ఉదయం క్రూసో కొండపైకి ఎక్కి శత్రువులు ఎవరైనా తన ద్వీపం మీదికి వచ్చారేమోనని తన దూరదర్శినితో చూసేవాడు. అంతే కాదు దైవవశాత్తు ఏదైనా ఓడ తన ద్వీపం వైపు వస్తే బాగుండునన్న ఆశతోగూడా చూస్తూ ఉండేవాడు.

ఏ ప్రమాదం సంభవించకుండా ఒక సంవత్సరం పాటు రోజులు గడిచాయి. రోజులు గడుస్తున్న కొద్దీ రాబిన్ సన్ క్రూసో ఆ పాదముద్ర విషయం మరచిపోసాగాడు.

## అధ్యాయము - 8

ఒక నాటి ఉదయం క్రూసో తన ఇంటి వద్ద నిలబడి చూస్తూ ఉండగా సముద్రంలో చాలా దూరాన అతనికి ఏదో నల్లగా కనబడింది. వెంటనే అతడు కొండ ఎక్కి దూరదర్శినితో అటు చూశాడు. ఒక పడవ తన ద్వీపమునుండి దూరంగా పోతున్నట్టు గమనించాడు. మరి కొంతసేపటికి అది మరి కనిపించలేదు. "ఎవరో ఇతర ద్వీపవాసులు నా ద్వీపానికి వచ్చి వెళ్తున్నట్టుంది" అని అనుకొన్నాడు.

అతని ఊహ నిజమే. చేరువలోని కొన్ని ద్వీపాలలో అడవి మనుష్యులు నివసిస్తున్నారు. వారిలో వారికి అప్పుడప్పుడు తగవులు వచ్చి, చిన్న యుద్ధాలుగా మారుతూ ఉండేవి. ఆ యుద్ధాలలో కొందరు ఇతరులకు బంధితులయేవారు. గెలిచిన వారు ఓడినవారిని క్రూసో నివసిస్తున్న ద్వీపానికి తీసికొని వచ్చి, చంపి, వండుకొని తింటూ ఉండేవారు. క్రూసోకు ఆనాడు కొంతమంది అడవి మనుష్యులు వారి బంధితులను క్రూసో ఉన్న ద్వీపానికి తీసికొనివచ్చి వారిని చంపి విందు చేసికొన్నారు. కాని ఆ విషయం క్రూసోకు తెలియదు.

క్రూసో కొండ దిగి వచ్చి, ఒక రైఫిల్ ను పట్టుకొని సముద్రతీరం వైపు వెళ్ళాడు.

అతనికి ఒక చోట మనుష్యుల తలలు, ఎముకలు, మాంసం ముద్దలు కనబడ్డాయి. వాటిని చూడగానే అతని ఒడలు జలదరించింది. వాటిని చూడలేక అతడు తన ముఖాన్ని ఇంకొక వైపుకు తిప్పుకొన్నాడు. అతనికి కడుపులో తిప్పి, తల తిరిగి కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎలాగో ధైర్యాన్ని కూడగట్టుకొని వీలయినంత త్వరగా తన ఇంటికి వెళ్ళాడు. ఆనాడు అతనికి ఏదీ తినాలనిపించలేదు. నిద్ర పోవాలని కళ్ళు మూసికొంటే అతనికి ఆ దృశ్యమే కళ్ళకు కట్టసాగింది. ఆ రోజంతా ఏదేదో ఆలోచిస్తూ భయంతో కాలం గడిపాడు.

పద్ధెనిమిది సంవత్సరాలపాటు నిర్భయంగా ఒంటరిగా క్రూసో ఆ ద్వీపంమీద జీవించగలిగాడు. కాని ఆనాటితో అతనికి ప్రాణభయం పట్టుకొంది. కాని తనకు తానే ధైర్యం చెప్పుకోవలసి వచ్చింది. చెట్ల చాటున ఉన్న తన ఇంట్లో మరొక పద్ధెనిమిది సంవత్సరాలు ఎవరికంటా పడకుండా బ్రతకవచ్చునన్న ధైర్యం అతనిలో కలిగింది. అయినా మరికొన్ని జాగ్రత్తలు అతనికి అవసర మనిపించాయి.

అనవసరంగా అతడు మందుగుండును కర్చు చేయ దలచు కొనలేదు. తప్పని సరిగా ఎప్పుడూ తన వెంట ఒక తుపాకీని తీసికొని వెళ్ళదలచాడు. మొలకు కట్టుకొనే తోలు పటకాలో రెండు కత్తులను ఎల్లప్పుడూ ఉంచుకొనదలచాడు. కర్రల మంట వల్ల వచ్చే పొగ చాలా దూరం కనబడే అవకాశం ఉందని బొగ్గులమీదనే వంట చేసికొనడం క్రూసో ప్రారంభించాడు.

ఒకనాటి సాయంత్రం అతనికి తుపాకీ పేలిన శబ్దం వినబడింది. అతడు వెంటనే కొండ శిఖరంపైకి వెళ్ళాడు. ఇంతలో బండరాళ్ళున్న తీరంవైపునుండి మళ్ళా తుపాకీ శబ్దం వినపడింది. వెంటనే అతడు దూరదర్శినితో అటువైపు చూశాడు. కాని అప్పటికే చీకటి పడినందువల్ల అతనికి ఏమి కనబడలేదు. మునిగిపోతున్న ఏదో ఓడనుండి ఆ ప్రేలుడు శబ్దాలు వచ్చియుండ వచ్చునని అతడు

అనుకొన్నాడు. ఆ ఊహ నిజమయి, ఆ ఓడలో ఎవరైనా సజీవులై ఉంటే వారికి నేల చేరువలోనే ఉందని తెలియడానికిగాను క్రూసో కొండపైని ఒక మంటపెట్టాడు.

ఆ మరునాడు తెల్లవారగానే దూరదర్శినితో తీరం వైపు చూశాడు. పొగమంచులో ఏదో ఒక ఓడ అక్కడ లంగరు వేసి ఉన్నట్టుగా అతనికి కనిపించింది.

అతడు వెంటనే చెట్ల చాటుగా కొండదిగి తీరంవైపుకు వెళ్ళాడు. సందేహంలేదు అది ఓడే ! అతనికి ఎంతో సంతోషం కలిగింది. కాని ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. ఆ ఓడ బండరాళ్ళకు ఢీకొని, విరిగి, ఒరిగిపోయి ఉంది. అతని ఆశ నిరాశ అయింది.

"పాపం ! ఆ ఓడ విరిగినందువల్ల ఎంతమంది మునిగి చనిపోయారో !" అని మనస్సులోనే విచారించాడు. ఒకరిద్దరైనా సజీవులై ఉంటే వారు తనకు తోడవుతారన్న ఒక ఆశ అతనికి కలిగింది. అతనికి ఎవరైనా తోడు అవసరమన్న కోరిక ఇంతవరకూ అంత ఎక్కువగా కలుగలేదు. కాని తన ద్వీపానికి అడవి మనుష్యుల రాకపోకలు ఎక్కువ అవుతున్నందువల్ల ఆ అవసరం అతనికి తెలియ వచ్చింది.

ఒకరైనా బ్రతికి ఉండవచ్చు నన్న ఆశతో అతడు తన పడవ మీద ఆ ఓడ వద్దకు వెళ్ళాడు. తన పడవను ఆ ఓడకు కట్టి ఓడపైకి వెళ్ళాడు. అతనికి ఒక కుక్క తోక ఆడిస్తూ స్వాగతం ఇచ్చింది. దానికి అతడు ఒక రొట్టెముక్క పెట్టాడు.

తర్వాత క్రూసో ఓడలో తిరగసాగాడు. ఓడలోని నీళ్ళలో మునిగి చనిపోయిన ఇద్దరు నావికులు మాత్రం అతనికి కనబడ్డారు. ఓడలోని ఆహారపదార్థాలన్నీ తడిసి పాడయినాయి. అతనికిఎంతో బాధ కలిగింది. ఆ ఓడలో అతనికి దక్కినవల్లా కొంత ద్రాక్షసారా, కొద్దిగా మిఠాయి, కొన్ని జతల బట్టలు, కొన్ని స్పెయిన్ దేశపు వెండి

నాణాలు, కొన్ని బంగారపు కడ్డీలు. ద్రాక్షసారా, మిఠాయి, బట్టలు అతనికి పనికివచ్చేవే కాని ఆ ఒంటరి జీవికి ఆ ద్వీపంమీద ఆ బంగారపు కడ్డీలు, వెండినాణాలు ఎందుకూ పనికిరానివే. అయినా వాటినన్నిటిని తీసికొని తన ద్వీపానికి బయలుదేరాడు. ఆ పడవ వెంట ఈదుకొంటూ కుక్క కూడా వచ్చింది. ఆ మధ్యనే తన కుక్క చనిపోయినందువల్ల ఈ కొత్త కుక్క తనకు తోడైనందుకు క్రూసో సంతోషించాడు.

తర్వాత కొన్ని నెలల వరకు క్రూసో జీవితం మామూలుగా గడిచిపోయింది. ఒకనాటి ఉదయం క్రూసో తన అలవాటు ప్రకారం కొండమీదికి వెళ్ళాడు. సుమారు రెండు మైళ్ళ దూరంలో సముద్రతీరాన అతనికి పొగ కనబడింది. వెంటనే అతడు దూరదర్శినితో చూశాడు.

అడవి మనుష్యులు కొందరు మంటచుట్టూ కూర్చొని ఏదో కాలుస్తున్నారు. క్రూసో వారిని లెక్కపెట్టాడు. వారు తొమ్మండుగురు ఉన్నారు. ఎవడినో చంపి, ఆ మంటలో కాల్చుకొని తినబోతున్నారని క్రూసో ఊహించుకొన్నాడు. అంతేకాదు "వచ్చేసారి వారు నన్ను చంపి విందు చేసికొంటారు కాబోలు !" అని తనకు తెలియకుండానే అనుకొన్నాడు. దాంతో అతని ఒడలు జలదరించింది.

క్రూసో బోర్లా పడుకొని వారిని దూరదర్శినితో అలా చూస్తూనే ఉన్నాడు. కాల్చుకొన్న మాంసాన్ని వారంతా తిని, తర్వాత ఆ మంట చుట్టూ ఒక గంట సేపు నృత్యం చేశారు. ఆ తర్వాత వారు సన్నని పొడుగుపాటి పడవలమీద పశ్చిమదిక్కుగా వెళ్ళిపోయారు. వారు కనుమరుగైన తర్వాత క్రూసో ఆ చోటుకు వెళ్ళాడు. అక్కడ అతనికి పుర్రెలు, ఎముకలు, మాంసం ముద్దలు కనబడ్డాయి. ఆ నాటి నుండి రాబిన్సన్ క్రూసోకు మనశ్శాంతి లేకుండా పోయింది.

# అధ్యాయము - 9

ఒక సంవత్సరం తర్వాత ఒకనాడు ఐదు పడవలలో ముప్పై మంది అడవి మనుష్యులు మళ్ళా ఆ తీరానికి వచ్చారు. ఈ సారి వారు తన మీద దాడి చేయవచ్చునని క్రూసో భయపడ్డాడు. కాని అతడు ఆ ద్వీపంమీద ఉన్నట్టు వారికి తెలుసునో, తెలియదో అతనికి తెలియదు. అయినా తన జాగ్రత్తలో తను ఉండడం మంచిదని క్రూసో అనుకొన్నాడు. అతడు వెంటనే తుపాకులలో మందుగుండు దట్టించాడు. ప్రహరీ గోడ లోని ఏడు కన్నాలవద్ద ఏడు రైఫిళ్ళను అమర్చాడు. తనవద్ద రెండు పిస్తోళ్ళను, రెండు కత్తులను ఉంచుకొని దాడిని ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాడు. కాని అడవి మనుష్యులు సముద్ర తీరం వద్దనే ఒక మంట చుట్టూ నృత్యం చేస్తూ అరుస్తున్నారు. కొంతసేపు వారిని అలా ఒక గోడ కన్నంలోనుండి క్రూసో చూశాడు.

తర్వాత వారికి కనబడకుండా జాగ్రత్తగా పిల్లిలాగ కొండ శిఖరంపైకి ఎక్కాడు క్రూసో. అక్కడ బోర్లా పడుకొని తన దూరదర్శినితో వారివైపు అతడు చూశాడు. ఆ అడవి మనుష్యులు అతి సంతోషంతో ఒడలు మరచి నృత్యం చేస్తూనే ఉన్నారు. కాళ్ళూ, చేతులూ బంధింపబడిన ఇద్దరు వ్యక్తులు వారికి చేరువులో నేలపైని పడి ఉన్నారు.

ఆ తర్వాత ఒక బంధితుని తలపైని ఒకడు దుడ్డుకర్రతో బలమైన దెబ్బకొట్టి చంపివేశాడు. ఆ వెంటనే మరి కొందరు హతునిమీద పడి అతన్ని ముక్కలుముక్కలుగా చీల్చివేశారు. తర్వాత అతని మాంసాన్ని కాల్చుకొని తిన్నారు. ఆ అనందంలో వారుండగా రెండవ బంధితుడు ఎలాగో కష్టపడి కట్లు విప్పుకొని పరుగెత్తసాగాడు. వాడు కొంత దూరం పరుగెత్తి వెళ్ళేవరకు అతన్ని వారిలో ఎవరూ చూడలేదు. తర్వాత వారిలో ముగ్గురు అతన్ని చూసి వెంబడించారు. ఇంతలో

ఖైదీకి ఉప్పుటేరు అడ్డువచ్చింది. అయినా అతడు నీటిలోనికి దుమికి ఈదడం మొదలుపెట్టాడు. అతడ్ని వెంబడిస్తున్న ముగ్గురిలో ఒకడికి ఈతరాదు. అందువల్ల వాడు వెనక్కు తిరిగి తన ముఠాను చేరుకొన్నాడు. మిగిలిన ఇద్దరూ నీటిలోనికి దుమికి ఈదుతూ ఖైదిని వెంబడించారు.

ఆ ఖైదీ యువకుడైనందువల్ల ఆత్మరక్షణకోసం వడి వడిగా ఈది ఆవలి ఒడ్డు చేరుకొని పరుగెత్తసాగాడు. అతన్ని వెంటాడుతున్న ఆ నరరూప రాక్షసులు మరింత వెనకబడ్డారు. కొండ శిఖరం పైనుండి క్రూసో ఇదంతా గమనించాడు. ఎలాగైనా ఆ ఖైదీని రక్షించగలిగితే తనకొక తోడు దొరుకుతాడన్న ఆశ అతనికి కలిగింది. వెంటనే ఒక రైఫిల్ ని చేతపుచ్చుకొని, వడివడిగా కొండదిగి, ఖైదీకి ఆ అడవి మనుష్యులకు మధ్యగా వచ్చి క్రూసో నిలిచాడు.

క్రూసోను చూడగానే ఆ అడవి మనుష్యులు అతని మీదకు రాబోయారు. వెంటనే క్రూసో వారిమీదకు రైఫిల్ ని పేల్చాడు. వారిలో ఒకడు ఆ దెబ్బకు నేలకూలేడు. రెండవవాడు ఆ తుపాకీ మోతకు మొదట జడిసినా తర్వాత ధైర్యం తెచ్చుకొని తన విల్లును తీసి అమ్మును ఎక్కుపెట్టాడు. సముద్రతీరాన్న ఉన్న ఇతర అడవి మనుష్యులకు వీరు కనబడకుండా చెట్ల మరుగున ఉన్నా తుపాకీ శబ్దానికి వారంతా తనమీదకు రావచ్చునన్న భయం క్రూసోకు కలిగింది. ఐనా ఆ పరిస్తితులలో తనను తాను రక్షించు కొనడానికి రెండవవానినికూడా కాల్చిచంపక తప్పలేదు.

ఆత్మ రక్షణకోసం పరుగెత్తుతున్న ఖైదీ రైఫిల్ శబ్దానికి భయపడి వెనక్కు తిరిగి కొయ్యలాగ నిలబడిపోయాడు. తన శత్రువులు ఇద్దరూ నేలమీద పడి ఉండడం చూశాడు. తన శత్రువుల ముఠానుండి ఇంకెవ్వరూ తమవైపు వస్తున్నట్టు అతనికి గోచరించలేదు. విందు ఆరగిస్తున్న ఆనందంలో ఏమి జరిగిందీ వారికి తెలిసి

ఉండదు. క్రూసో ఒక సారి చుట్టూ కలియజూశాడు.

ఆ ఖైదీని తన దగ్గరకు రమ్మనమని క్రూసో పిల్చాడు. కాని వాడు భయంతో కదల లేదు. క్రూసో ఈ సారి వాడిని చేత్తో సంజ్ఞ చేసి పిల్చాడు. కొంతసేపటికి వాడు అడుగులోఅడుగు వేసికొంటూ మెల్లగా క్రూసో వైపు నడిచాడు. వాడికి భయం పోగొట్టడానికి క్రూసో అతని వైపు నవ్వుతూ చూశాడు. దాంతో ఆ ఖైదీకి కాస్త భయం తగ్గింది. ప్రతి రెండు అడుగులకు ఒక సారి శరణుజొచ్చినట్టు మోకాళ్ళ పైని కూర్చొని లేస్తూ క్రూసోకు చేరువుగా అతడు వచ్చాడు. తర్వాత క్రూసో పాదాన్ని ఎత్తి తన నెత్తిపైని పెట్టుకొన్నాడు. ఇకమీదట అతడు క్రూసోకు దాసుడుగా ఉనండడానికి నిశ్చయించుకొన్నట్టు తన అంగీకారాన్ని ఆ విధంగా అతడు తెలియజేశాడు.

అతన్ని స్నేహపూర్వకంగా క్రూసో లేవనెత్తాడు. కాని అతడు భయపడుతూ తన భాషలో ఏమేమో మాట్లాడసాగాడు. ఆ మాటలకు అర్థం క్రూసోకు తెలియకపోయినా వాటి తాత్పర్యం స్నేహాన్ని కోరుతున్నట్టు క్రూసో గ్రహించాడు. సుమారు ఇరవై అయిదు సంవత్సరాల అనంతరం మళ్ళా ఆనాడు క్రూసో మనుష్య కంఠస్వరం విన్నాడు. అతనికి ఎంతో ఆనందం కలిగింది.

ఇంతలో తుపాకి దెబ్బ తిన్న మొదటివాడు లేచి కూర్చున్నాడు. క్రూసో మొలకు వ్రేలాడుతున్న కత్తిని అతని కొత్త స్నేహితుడు అడిగి తీసికొని తమ శత్రువుల తలలు నరికి క్రూసో పాదాలముందు ఉంచాడు. శత్రువుల వద్దనున్న విల్లు, అమ్ములను అతడు తీసికొన్నాడు. తర్వాత ఒక పెద్దగొయ్యి తీసి దానిలో తన శత్రువుల శవాలను పాతిపెట్టాడు.

విధేయుడైన బానిస ఒకడు ఇప్పుడు క్రూసోకు దొరికాడు. ఆ బానిసను క్రూసో తన ఇంటికి తీసికొని వెళ్ళి వాడికి కడుపునిండా తిండి పెట్టాడు. ఒక దుప్పటి ఇచ్చి

కప్పుకొని పడుకొనమని సంజ్ఞలతో క్రూసో చెప్పాడు. అలిసిపొయిన ఆ బానిసకు, కడుపునిండా తిండి దొరకడంతో పడుకొన్న వెంటనే హాయిగా నిద్ర పట్టింది.

ఒడలు మరిచి హాయిగా నిద్రపోతున్న తన బానిసవైపు క్రూసో తదేకంగా చూశాడు. అతడు యువకుడు. అతనికి ఇంకా ఇరవై అయిదు ఏళ్ళు నిండి ఉండవు. ఒడ్డుగా పొడుగ్గా ఆరోగ్యంగా ఉన్నాడు. కండలు తిరిగిన దేహంతో బలంగా కనబడుతున్నాడు. అతని జుట్టు ఉంగరాలు తిరిగి లేదు, పొడుగ్గా మామూలుగా ఉంది. చర్మం నల్లగా లేదు. చామన చాయ రంగులో ఉంది. పెదిమలు మోటుగా లేవు. నాజూకుగా ఉన్నాయి. ముక్కు దిబ్బగా లేదు. బాగానే ఉంది. అతని పలువరుస తీర్చి దిద్దినట్టుంది. అతడు ఆ అడవి మనుష్యులకు భిన్నంగా ఉన్నాడు.

ఒక గంటసేపు హాయిగా నిద్రపోయి ఆ బానిస లేచాడు. అతడు వెంటనే తిన్నగా క్రూసో వద్దకు వెళ్ళి అతని పాదాల ముందు మోకరిల్లాడు. క్రూసో పాదాలను తన నెత్తిన పెట్టుకొన్నాడు. "ఇకమీదట నేను మీ బానిసను" అని అతడు తెలియజేస్తున్నట్టు క్రూసోకు అనిపించింది.

క్రూసో మాతృభాష ఇంగ్లీషు. అది ఆ బానిసకు అర్థం కాదు. అతడు మాట్లాడే ఆటవిక భాష క్రూసోకు బోధపడదు. అందువల్ల వారిద్దరూ ఒకరి భావాలను ఒకరికి సంజ్ఞలతోనే తెలియజేసికొన్నారు. ఒకరిని ఒకరు బాగానే అర్థం చేసికొన్నారు. ఆ బానిసను దయతో చూడడానికి క్రూసో అంగీకరించాడు. అతనికి సేవ చేయడానికి ఆ బానిస అంగీకరించాడు.

శుక్రవారంనాడు అతని ప్రాణాలను క్రూసో రక్షించాడు గనుక అతనిని ఆనాటినుండి 'ఫ్రైడే' అని క్రూసో పిలవసాగాడు. తనను ' మాస్టర్ ' అని సంబోధించమని ఫ్రైడేకి చెప్పాడు.

తర్వాత 'ఎస్ ' 'నో' అని ఎప్పుడు అనాలో క్రూసో ఫ్రైడేకి నేర్పాడు.ఆ తర్వాత తన ఇంట్లోనున్న వివిధ వస్తు సామగ్రుల పేర్లను నేర్పాడు. స్వతహాగా ఫ్రైడే తెలివైన వాడు. కనుక అతడు చాలా ఇంగ్లీషు పదాలను త్వరలో నేర్చుకొన్నాడు.

క్రూసో తన పాత బట్టలను ఫ్రైడేకి ఇచ్చాడు. తన మాస్టర్ లాగే తనూ బట్టలు ధరించినందుకు ఫ్రైడే మురిసి పోయాడు.

## అధ్యాయము - 10

రాబిన్సన్ క్రూసోకు ఒంటరి జీవితం పోయింది. అతనికి నూతన ఉత్సాహం కలిగింది. ఫ్రైడేకి ఇంగ్లీషు భాష నేర్పడం, వంట నేర్పడం, ఇంకా ఇతర పనులు నేర్పడంతో క్రూసోకు దొంత కాలక్షేపంగానే ఉంది.

పిండి దంచి రొట్టెలు చేయడం ఫ్రైడే నేర్చుకొన్నాడు. దీనివలన క్రూసోకు శ్రమతగ్గి కాస్త విశ్రాంతి లభించింది. పోఫ్రైడే త్వర త్వరగా ఇంగ్లీషు నేర్చుకొంటూ ఉండడం వల్ల చాలా సంవత్సరాల తర్వాత ఇంకొకరితో మాట్లాడే అవకాశం కలిగినందుకు క్రూసో ఎంతో ఆనందం పొందాడు. ఫ్రైడే అంటే క్రూసోకు ఆదరం అభిమానం ఏర్పడ్డాయి.

ఒకనాడు క్రూసో ఫ్రైడేతో కలిసి సముద్ర తీరానికి వెళ్ళాడు. అడవి మనుషులు ఎవరినో చంపి తిని వదలిపెట్టిన మనుష్యుల తలలు, ఎముకలు, మాంసం ముద్దలు ఒకచోట పడి ఉన్నాయి. వాటిని పాతిపెట్టమని క్రూసో ఫ్రైడేకి చెప్పాడు. ఆ పని చేస్తున్నంతసేపూ వాటిని తింటే బాగుండు నన్నట్లు ఫ్రైడే చూస్తూ ఉండడం క్రూసో గమనించి అతనిలో ఇంకా వెనుకటి గుణం పోనందుకు ఆశ్చర్యపోయాడు.

మనుష్య మాంసం తినకూడదని క్రూసో ఫ్రైడేకి నచ్చ చెప్పాడు. తన మాస్టర్ తన ఉద్దేశ్యాన్ని గ్రహించినట్టు ఫ్రైడే తెలిసికొని సిగ్గు పడ్డాడు. తన తప్పును

క్షమించమని ఫ్రైడే తన మాష్టర్ ను వేడుకొన్నాడు. ఆ తర్వాత మరెప్పుడు కూడా నరమాంసం తినాలన్న కోరిక ఫ్రైడేలో కలుగలేదు.

రానురాను ఫ్రైడేకి ఇంగ్లీషు బాగా అర్థం కాజొచ్చింది. తప్పో, ఒప్పో జంకు లేకుండా ఇంగ్లీషు మట్లాడడం ఫ్రైడే అలవరచుకొన్నాడు.

ఆ ద్వీపం మీదకు తను ఎలా వచ్చిందీ క్రూసో ఫ్రైడేకి వివరించి చెప్పాడు. తమ ఓడ ఎలా ఉండేదో క్రూసో వర్ణిస్తూ ఉంటే ఫ్రైడే ఆశ్చర్యపోయాదు. అటువంటి ఓడే ఒకటి నాలుగు సంవత్సరాలక్రితం తను నివసిస్తూ ఉండిన ద్వీపానికి తుఫానులో కొట్టుకొని వచ్చి విరిగిపోయిందని, అందులోనుండి పదిహేడు మంది తెల్లవారిని ఆ ద్వీపవాసులు రక్షించారని ఫ్రైడే చెప్పాడు. "ఆ తెల్లవారిని మేము కారిబ్బులని అంటాం. వారు మనుష్యుల్ని చంపుతారనుకొండి" అన్నాదు ఫ్రైడే.

దక్షిణ అమెరికాలోని స్పెయిన్ దేశస్థులగురించి ఫ్రైడే చెప్తున్నట్టు క్రూసో గ్రహించాడు.

అక్కడికి చేరువలోనున్న ఒక పెద్ద ద్వీపం ఫ్రైడే స్వదేశం. ఎలాగైనా ఆ ద్వీపాన్ని చేరుకొంటే అక్కడ ఉన్న తెల్లవారి సహాయంతో ఒక పెద్ద పడవను నిర్మించి దానిలో తన స్వదేశానికి చేరుకోవచ్చునన్న ఆశ క్రూసోకు కలిగింది. తను తయారు చేసిన పడవ వద్దకు ఫ్రైడేని తీసికొనివెళ్ళి దానిని చూపించి డానిలో ఆ పెద్ద ద్వీపానికి వెళ్ళడానికి వీలవుతుందా అని క్రూసో అడిగాడు. ఆ ప్రశ్న వినగానే ఫ్రైడే ముఖం చిన్నబోయింది

"ఏం అలా విచారంగా ఉన్నావు ? మీ వాళ్ళు జ్ఞాపకం వచ్చారా ?" అని క్రూసో అడిగాడు.

"నేనేం చేశాను మాస్టర్ ? నా మీద మీకెందుకంత కోపం ?" అంటూనే ఫ్రైడే

అక్కడనుండి వెళ్ళిపోయాడు.

మరి కొద్ది సేపటిలో ఒక గొడ్డలిని తీసికొనివచ్చి క్రూసోకు ఇచ్చాడు.

"ఇది ఇప్పుడెందుకూ ?" అని క్రూసో అడిగాడు.

"నన్ను నా దేశం పొమ్మంటున్నారు గదా ? నేనంటే మీకు ఇష్టం లేదు. కనుక నన్ను దీంతో చంపండి. నా పీడ మీకు వదులుతుంది." అన్నాడు ఫ్రైడే తల వాల్చుకొని.

క్రూసో ఆ మాటలకు ఆశ్చర్యపోయి "నీ మీద నాకు కోపం లేదే ! అలా ఎందుకు అనుకొంటున్నావు ? అని అడిగాడు.

"మరి నన్నెందుకు నా దేశం పొమ్మంటున్నారు"

"నీ వాళ్ళను చూడాలని నీకు లేదా ?"

"ఎందుకు లేదు ? చూడాలనే ఉంది. కాని నేను మిమ్మల్ని విడిచి వెళ్ళను. మీరు వస్తేనే వెళ్తాను."

"నేను మీ దేశం వస్తే మీ వాళ్ళు నన్ను చంపి తినరా ?"

"తినరు. మిమ్మల్ని మా వాళ్ళు ఏమీ చేయకుండా నేను చూస్తాను. మీ వంటి తెల్ల దొరలు అక్కడ కొంత మంది ఉన్నారు గదా ?" అంటూ ఫ్రైడే కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు.

తనమీద ఫ్రైడేకి ఎంత ప్రేమ, అనురాగం, గౌరవం ఉన్నాయో క్రూసో ఆ క్షణాన గ్రహించాడు. "నిన్ను ఒంటరిగా మీ దేశం పంపించను. నీవు నాతోటే ఉందువుగాని. ఇద్దరం కలిసే మీ దేశం వెళ్దాం. కాని ఈ పడవలో మనిద్దరం వెళ్ళగలమా ?" అని ఫ్రైడేకి అర్ధమయ్యేటట్టు విడమర్చి అడిగాడు.

"ఇది కెరటాల తాకిడికి నిలవదు. మునిగిపోతుంది. ఇంతకన్నా పెద్ద పడవ కావాలి" అన్నాడు ఫ్రైడే.

"అయితే మనం ఒక పెద్ద పడవను తయారు చేద్దాం" అన్నాడు క్రూసో.

పెద్ద పడవను తయారు చేయడానికి ఒక పెద్ద చెట్టును ఆ మర్నాడే ఫ్రైడే ఎన్నుకొన్నాడు. అతనికి చెట్ల గురించి బాగా తెలుసును ఆ చెట్టును గొడ్డలితో ఒక రోజులో అతడు నరికి పడగొట్టాడు.

తనవద్దనున్న వడ్రంగి పనిముట్లను ఎలా ఉపయోగించాలో క్రూసో ఫ్రైడేకి నేర్పాడు. వారిద్దరూ కలిసి కష్టపడి ఒక నెల రోజుల్లో ఆ మానును పడవగా తయారు చేశారు. క్రూసో చేసిన పడవ కన్నా ఇది చాలా పెద్దది. తీరానికి దూరంగానే ఉన్నా ఒకరికి ఒకరు తోడు ఉండడంతో వారిద్దరూ కలిసి గుండ్రని కర్రముక్కలపైని ఆ పడవను జరుపుకొంటూ సముద్ర తీరానికి చేర్చారు. సముద్రానికి పోటు వచ్చినప్పుడు ఫ్రైడే ఒక్కడే అతి సులువుగా ఆ పడవను నీటిలోనికి మళ్ళించాడు. అతని నేర్పుకు క్రూసో ఆశ్చర్యపోయాడు. కెరటాలలో తేలియాడుతున్న ఆ పడవను చూసి వారిద్దరూ ఒకర్ని ఒకరు అభినందించుకొన్నారు.

"ఈ పడవలో మనం మీ దేశం వెళ్ళగలమా ?" అని క్రూసో ఫ్రైడేని అడిగాడు.

"ఓ ! సులువుగా వెళ్ళగలం ! పెనుగాలి ఎదురు వచ్చినా వెళ్ళగలం !" అంటూ ధైర్యంతో, గర్వంతో, సంతోషంతో ఫ్రైడే చెబుతూ ఆనందంతో నృత్యం చేశాడు.

తర్వాత ఫ్రైడే, క్రూసో కలిసి ఒక తెరచాపను ఒక కొయ్యకు అమర్చారు. ఇతర హంగులన్నీ ఆ పడవలో అమర్చుకొనడానికి వారికి మరి రెండు నెలలు పట్టింది. పడవ సముద్రయానానికి తయారయింది. కాని ఇంతలో వర్షాకాలం వచ్చింది. వారి

సముద్ర యానం వాయిదా పడింది.

## అధ్యాయము - 11

వర్షాకాలం గడిచి, శీతాకాలం ప్రవేశించింది. సముద్ర యానానికి వాతావరణం అనుకూలంగా ఉంది. క్రూసో తమ ప్రయాణానికి కావలసినవన్నీ ఒకనాడు తన 'సాగరదృశ్యం'లో అమర్చుకొంటున్నాడు. ఫ్రైడేని పడవను సిద్ధం చేయమన్నాడు. పడవ వద్దకు వెళ్ళిన ఫ్రైడే అక్కడినుండి పరుగెత్తుకొంటూ, "ఓ మాష్టర్ ! ఓ మాష్టర్ ! ..." అని అరుస్తూ వచ్చాడు.

ఆ అరుపులకు క్రూసో తన పని వదిలిపెట్టి ఫ్రైడేకి ఎదురు వెళ్ళి "ఏమిటి ఫ్రైడే ? ఏమి జరిగింది ?" అని అడిగాడు.

"అటు చూడండి మాష్టర్ ! పడవలు, మూడు పడవలు ! ఒకటీ! రెండూ! మూడూ !" అంటూ ఉద్రేకపడుతూ సముద్రం వైపు దూరంగా చూపించాడు. ఆ పడవలను చూసి ఫ్రైడే భయపడుతున్నట్టు క్రూసో గ్రహించాడు. భయపడవద్దని ఫ్రైడేకి అతను ఎంత చెప్పినా లాభం లేకపోయింది. ఆ పడవలలో అడవి మనుష్యులే వస్తున్నారనీ, వారు తనను చంపి తింటారని భయపడ్డాడు.

"ఫ్రైడే ! మన వద్ద తుపాకులు ఉన్నాయి, ఎంత మంది అడవి మనుష్యులు వచ్చినా నేను వారిని చంపగలను. నీవు వట్టి పిరికివాడివి. కనుక వెళ్ళి ఆ గుహలో తలదాచుకో !" అని క్రూసో అన్నాడు. దాంతో ఫ్రైడేకి పౌరుషం వచ్చి "మాష్టర్! నేనూ యుద్ధం చేస్తాను" అని అన్నాడేగాని మరుక్షణంలో "మాష్టర్ ! మనం ఇద్దరం ! వాళ్ళు చాలా మంది ఉన్నారు" అన్నాడు.

"మరేం భయంలేదు. కనబడకుండా చెట్ల చాటునుండి వారిని ఎలా చంపవచ్చునో నాకు తెలుసును. ముందు ఇది కొంచెం తాగు. నీకు ధైర్యంవస్తుంది"

అని చెప్పి కొద్ది ద్రాక్ష సారాని ఫ్రైడే నోట్లో పోశాడు క్రూసో. ఆ తర్వాత క్రూసో ఫ్రైడేతో గూడా కొండశిఖరం మీదకు వెళ్ళి తన దూరదర్శినితో తీరంవైపు చూశాడు. మూడు పడవలలో నుండి ఇరవైమందికి పైగా అడవి మనుష్యులు దిగుతూ కనిపించారు. కాళ్ళూ, చేతులూ కట్టివేసిన ముగ్గురు వ్యక్తుల్ని పడవలలో నుండి వారు దింపి తీరాన్న పడవేశారు.

వారికి చేరువలో ఒక చిట్టడవి ఉంది. అక్కడనుండి ఎండు కర్రలను ఏరి తెచ్చి మంట పెట్టారు. మరి కొద్దిసేపటిలో ఆ ముగ్గురు బంధితుల్ని వారు చంపి ఆ మంటలో కాల్చుకొని తింటారని క్రూసో గ్రహించాడు. వెంటనే అతనికి ఆ అడవి మనుష్యులమీద చాలా కోపం వచ్చింది.

"ఫ్రైడే ! ఆ నరరూప రాక్షసులు ఆ ముగ్గురు అమాయకుల్ని చంపి తింటూ ఉంటే పిరికిపందలాగ ఇక్కడనుండి చూస్తూ కూర్చొనలేను. ఏమైనాసరే ఆ ముగ్గుర్నీ రక్షించాలి. నీవు నాకు సహాయం చెయగలవా ?"

"వారు చాలా మంది ...."

"నీవు పిరికివాడివి. ఇక్కడే ఉండు. నేనొక్కడ్నే వారిని ఎదిరించగలను. నేను వారందర్నీ చంపలేకపోయినా, భయపెట్టి వారిని తరిమి వేయ గలను. నీతో మాట్లాడుతూ మరొక్క క్షణం కూడా వృథా చేయదలచుకోలేదు". అంటూనే క్రూసో కొండ దిగాడు. ఫ్రైడే చేసేది ఏమిలేక క్రూసోను అనుసరించాడు.

"మాష్టర్ మీరు ఏం చేయమంటే అది చేస్తాను. ఏం చేయాలో ఆజ్ఞాపించండి." "అయితే, నీవు అన్ని తుపాకులలోను మందు దట్టించు" అని క్రూసో ఆజ్ఞాపించి తను కూడా తిపాకులలో మందు దట్టించడం ప్రారంభించాడు. కొద్దిసేపట్లో వారిద్దరూ  యుద్ధానికి సిద్ధమయ్యారు.

"ఫ్రైడే ! మాట్లాడకుండా, చప్పుడు చేయకుండా నా వెనుకనే రా. నేను ఏది చెపితే అదే చెయ్యి ! నోరు మెదపకూడదు. తెలిసిందా ? నా వెనుకనే రా" అంటూ ముందుకు నడిచాడు క్రూసో. వారిద్దరూ శత్రువులకు కనబడకుండా చెట్ల చాటున నక్కుతూ శత్రువులకు చేరువగా వెళ్ళారు. క్రూసో పిల్లిలాగ మెల్లగా చెట్టు చాటున ఉన్న ఒక మెట్ట ప్రదేశం చేరుకొన్నాడు. అక్కడనుండి చూస్తే అతనికి అడవి మనుష్యులు, వారి బంధితులు బాగా కనబడ్డారు. వారిలో ఒకడు తెల్ల వాడు.

అప్పటికే ఆ నరభక్షకులు అకణ్ణి చంపివేశారు. ఇంకొకణ్ణి చంపడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంక ఒక్క క్షణం క్రూసో ఆగ దలచుకొనలేదు.

"ఫ్రైడే ! సిద్ధంగా ఉన్నావా ?" అని మెల్లగా అడిగాడు. "యస్ మాష్టర్ !" అని వినీ వినిపించకుండా అన్నాడు ఫ్రైడే. అతడు అన్నింటికి తెగించి మొండి ధైర్యంతో ఉన్నట్టు క్రూసో గ్రహించి, "అయితే వారి మీదకు తుపాకీ పేల్చు !" అని అతన్ని అజ్ఞాపించి వెంటనే అతనుకూడా శత్రువుల మీదకు తుపాకీ పేల్చాడు. ఫ్రైడే కూడా తుపాకీ పేల్చాడు. ఆ దెబ్బలకు ఇద్దరు అడవి మనుష్యులు చనిపోయారు. మరిద్దరు గాయపడ్డారు. మిగిలిన వారంతా భయభ్రాంతు లయ్యారు. ఎటు పరిగెత్తితే ఏమి ప్రమాదం వస్తుందో అన్నట్టు వారంతా బొమ్మల్లాగ నిలబడి పోయారు.

క్రూసో ఏమి చెబితే అది, క్రూసో ఏది చేస్తే అది చేయడానికి నిశ్చయించుకొన్న ఫ్రైడే తన మాష్టర్నే చూస్తున్నాడు. క్రూసో పేల్చిన తుపాకీని కింద పడవేసి మరొక తుపాకీని తీసికొన్నాడు. ఫ్రైడే కూడా అలాగే చేశాడు. కొంతసేపు వారిద్దరూ ఆ అడవి మనుష్యుల మీదికి తుపాకులను పేల్చారు. ఆ అడవి మనుష్యులు ప్రాణభీతితో ఇటూ, అటూ పరుగెత్త సాగారు. గాయపడిన వారు కింద పడి మూలుగుతున్నారు.

"ఫ్రైడే నా వెనుకనే రా !" అంటూ మరొక తుపాకీని తీసికొని చెట్లచాటునుండి

బైటకు వచ్చి క్రూసో బంధితుల వైపు నడవసాగాడు. మరొక తుపాకీతో ఫ్రైడే తన మాష్టర్ని అనుసరించాడు. వీరిని చూడగానే అడవి మనుష్యుల్లో నలుగురు పరుగెత్తుకొంటూ వెళ్ళి రెండు పడవల మీదికి ఎక్కారు.

ఫ్రైడే శత్రువుల మీదికి తుపాకీని పేలుస్తూ ఉంటే క్రూసో బంధితుల బంధనాలను విప్పాడు. కాని ఆ ఇద్దరిలో తెల్లవాడు ఒక్కడే ప్రాణాలతో ఉన్నాడు. అతనిని క్రూసో లేవనెత్తాడు. అతడు స్పానిష్ భాషలో క్రూసోకు కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. ఆ స్పెయిన్ దేశస్తుడు చాలా నీరసంగా ఉన్నా క్రూసో ఇచ్చిన తుపాకీని చేత పుచ్చుకొని ఆ నరభక్షకుల్ని ఎదిరించడానికి సంసిద్ధుడయ్యాడు. పడవలు ఎక్కిన ఆ నలుగురు వీరి మీదకు బాణాలను వదిలారు. కాని అవి వీరికి తగలలేదు. అందువల్ల వారు మరింత భయపడి పడవలను సముద్రంలోనికి తీసికొని పోసాగారు. వారి పడవ ఒకటి తీరాన్న ఉండిపోయింది.

ఆ నలుగురు వెళ్ళి ఒక సైన్యాన్ని కూడదీసికొని వచ్చి ఈ ద్వీపాన్ని ముట్టడించే అవకాశముందని, శతృశేషం లేకుండా చేయాలని క్రూసో నిశ్చయించుకొని మూడవ పడవలోనికి ఫ్రైడేతో కూడా అతడు ఎక్కాడు. అందులో ఇంకొక బంధితుడు బోర్లా పడి ఉన్నాడు.

క్రూసో అతని బంధాలను కోసి అతన్నీ లేవతీసి కూర్చో పెట్టాడు. అతని ముఖం చూడాగానే ఫ్రైడే ఒక కేకపెట్టి నవ్వుతూ, పాడుతూ సంతోషంతో గెంతడం ప్రారంభించాడు. అతనికి అంత ఆనందం ఎందుకు కలిగిందో క్రూసోకు వ్సెంటనే తెలియలేదు. ఆ తర్వాత తెలిసింది, ఆ బంధితుడు ఫ్రైడే తండ్రేనని.

ఈ ఆనందంలో శతృవులను వెంబడించాలన్న సంగతి ఆ ఇద్దరూ మరచిపోయారు. అది కూడా వారి మేలుకే జరిగింది. మరి రెండు గంటలు

గడవకముందే పెద్ద గాలివాన వచ్చింది. వారిని వెంబడించి ఉంటే ఆ గాలివానకు బ్రతికి బయటపడేవారు కారు.

ఫ్రైడే ఉపచారాలు చేయగా అతని తండ్రి కాస్త తేరుకున్నాడు. ఉద్రేకంతో శత్రువులను ఎదిరించిన స్పెయిన్ దేశస్తుడు నీరసం వచ్చి ఒక చెట్టుకింద వాలిపోయాడు. వారిద్దరూ తిండి తిని ఎన్నాళ్ళయిందో !

"ఫ్రైడే ! వీళ్ళిద్దరూ తినడానికి ఏమైనా త్వరగా తీసికొని రా, నీళ్ళు మరచిపోకు !" అని చెప్పి క్రూసో ఫ్రైడేని ఇంటికి పంపించాడు. ఫ్రైడే పరుగెత్తుకొని వెళ్ళి వారిద్దరికీ సరిపోయినన్ని రొట్టెలు, పళ్ళు, నీళ్ళు తీసికొని వచ్చాడు ఫ్రైడే. అతని తండ్రికి నోరు ఆర్చుకొని పోవడం వల్ల రొట్టెలు, పళ్ళు తినలేక అతడు కడుపు నిండా నీళ్ళు మాత్రం తాగాడు. ఆ ఇద్దరూ కాస్త తేరుకొన్నా లేచి నడవలేకపోయారు. ఫ్రైడే, క్రూసో కలిసి ఆ ఇద్దర్నీ పడవమీద 'సాగరదృశ్యాని 'కి చేరువగా తీసికొని వెళ్ళారు.

క్రూసో ఒక స్ట్రెచ్చర్ లాంటిది తెరచాప గుడ్డతో తయారుచేశాడు. దాని మీద వారిని మోసుకొని వెళ్ళాడు. ఇంటి ముందు ఒక గుడారాన్ని ఫ్రైడే వేసి అందులో వారిద్దర్నీ పడుకొనబెట్టాడు. స్పెయిన్ దేశస్తుడు ఆ మర్నాటికి తేరుకొన్నాడు.

## అధ్యాయము - 12

చాలామంది స్పెయిన్ దేశస్థులు ఆర్జెంటైనా నుండి వ్యాపారరీత్యా హవానా వెళ్తూ ఉండగా వారి ఓడ ఒక ద్వీపానికి ఢీకొని విరిగి పోయింది. ఆ ద్వీపమే ఫ్రైడే స్వదేశం. ఆ ఓడలోనున్న వారిలో చాలామంది చనిపోయారు. పదిహేడు మంది మాత్రం బ్రతికి బయటపడ్డారు. వారంతా ఆ ద్వీప వాసులకు బందీలయ్యారు. వారు ఈ స్పెయిన్ దేశస్తులకు తినడానికి ఇంత తిండి పెడుతూ మర్యాదగా చూస్తున్నట్టు నటిస్తున్నారు. వీరిలో ఒక్కొక్కర్నే క్రూసో ఉన్న ద్వీపానికి

తీసికొనివచ్చి చంపి విందు చేసికొనాలని ఆ నరభక్షకుల ఆలోచన. ఈ విషయం ఆ తెల్లవారు గ్రహించలేదు. కాని వారికి ఆ ద్వీపం మీద జీవించడం కష్టంగానే ఉంది. అందువల్ల ఎలాగైనా ఆ ద్వీపంనుండి వారి స్వదేశానికి వెళ్ళాలన్న ప్రయత్నంలో ఉన్నారు కాని వెళ్ళడానికి వీలులేక ఆ ద్వీప వాసులతో స్నేహంగా ఉంటున్నట్టు వారూ నటిస్తున్నారు. మరిద్దరు అడవి మనుష్యులతో గూడా ఆ స్పెయిన్ దేశస్తుణ్ణి చంపి విందు చేసికొనాలని ఆ అడవి మనుష్యులు అనుకొన్నారు కాని క్రూసో అంతా తారుమారు చేశాడు. హంతకులలొ కొందరు తుపాకీ దెబ్బలకు బలి అయ్యారు. మిగిలినవారు తుఫానువల్ల సముద్రంలో ములిగిపోయారు.

ఆ స్పెయిన్ దేశస్థుడు తన కథను పూర్తిగా క్రూసోకు చెప్పి "మీరు నన్ను రక్షించి ఉండకపోతే వారు నన్ను చంపి విందు చేసికొని ఉందురు. నేను మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి, మీకు విధేయుణ్ణి" అంటూ తన కథను ముగించాడు.

"మీ నావికులలో మిగతా పదహారుగురూ బ్రతికి ఉన్నట్టేనా ?"

"వారు ప్రస్తుతం బ్రతికే ఉన్నారనుకొంటాను, కాని త్వరలో వారిని ఈ రాక్షసులు తమ పొట్టను పెట్టుకొనక మానరు"

"అయితే మనం వారిని ఎలాగైనా రక్షించాలి. మనం ఆ ద్వీపానికి వెళ్ళి వారిని ఇక్కడకు తీసికొని వద్దాం. మనమంతా కలిసి ఒక ఓడను నిర్మించి దానిలో ఈ మహా సముద్రాలను దాటి మన దేశాలను చేరుకొందాం. మరి మీ దేశస్తులు నాతో సహకరిస్తారా ?"

"సంతోషంతో సహకరిస్తారు. ఎలాగైనా స్వదేశం చేరుకోవాలన్న ఆతృతతో వారూ ఉన్నారు."

"అయితే మన ప్రయాణానికి సిద్ధం కమ్మంటారా ?"

"మీరు రానవసరంలేదు. నేను ఈ ముసలివానితో వెళ్ళి వారందర్నీ ఇక్కడకే తీసికొని వస్తాను. కాని వారంతా ఇక్కడికి వస్తే తగిన ఆహారం ఇక్కడ ఉందా ?"

"ప్రస్తుతం ఉన్న తిండి గింజల్నీ, గొర్రెలవల్ల లభించే పాడిని జాగ్రత్తగా వాడుకొందాం. అడవిలో కావలసినన్ని పళ్ళున్నాయి. మనమంతా కలిస్తే ఇరవై మంది అవుతాంగదా ? అందరం కష్టపడి పని చేద్దాం. మన సేద్యాన్ని వృద్ధి చేద్దాం. ఒక ఓడను నిర్మించుకొందాం. దీని అంతటికి ఒకటి రెండు సంవత్సరాలు పట్టినా మన కష్టానికి ఫలితం దక్కకపోదు. మన దేశాలు చేరుకొనలేకపోము. కనుక తిండి విషయమై ఆలోచించనవసరం లేదు. మీరు వెళ్ళి వారిని తీసికొని రండి." అంటూ క్రూసో అతన్ని ప్రోత్సహించాడు.

"అయితే రేపు ఉదయమే మేము బయలుదేరి వెళ్తాం." అన్నాడు ఆ స్పెయిన్ దేశస్థుడు.

అడవి మనుష్యులు తీసికొని వచ్చిన పడవలో ఎనిమిది రోజులకు, పద్దెనమండుగురికి సరిపోయే ఆహారపదార్థాలను పెట్టమని క్రూసో ఫ్రైడేతో చెప్పాడు. అవసరమైతే అడవి మనుష్యులను ఎదుర్కొనడానికిగాను, రెండు తుపాకులను, కొంత మందు గుండును క్రూసో స్పెయిన్ దేశస్థునికి ఇచ్చాడు. ఆ మర్నాటి ఉదయమే స్పెయిన్ దేశస్థుడు, ఫ్రైడే తండ్రితో సహా సముద్ర యానానికి సిద్ధమయ్యాడు. "సుఖంగా వెళ్ళి లాభంగా రండి" అంటూ క్రూసో వారికి వీడ్కోలు ఇచ్చాడు.

ఎనిమిది రోజుల్లో వారిద్దరూ ఇతర స్పెయిన్ దేశస్థులతో గూడా తిరిగి రావచ్చునని క్రూసో అంచనా వేశాడు. వారు వెళ్ళిన ఎనిమిదవ రోజున క్రూసో వారి రాక కోసం కొండ శిఖరం మీద నిరీక్షించాడు. కాని వారి జాడ కాన రాలేదు.

తొమ్మిదవ రోజున కొండ శిఖరంపైని ఫ్రైడేని ఉండమని చెప్పి క్రూసో తన ఇంట్లో వల ఉయ్యాలలో విశ్రాంతి తీసికొంటూ, స్వదేశ ప్రయాణానికి పథకాలు వేసికొంటూ ఉండగా ఫ్రైడే పరుగెత్తుకొంటూ వచ్చి "మాష్టర్ ! మాష్టర్ ! వాళ్ళొస్తున్నారు ! వాళ్ళొస్తున్నారు !" అంటూ సంతోషంతో కేకలు పెట్టాడు.

ఉయ్యాలలోనుంచి క్రూసో ఒక్క గంతు గెంతి కొండ శిఖరం మీదికి పరుగు పరుగున వెళ్ళాడు. అక్కడనుండి దూరదర్శినితో తీరం వైపు చూశాడు. దూరంగా సముద్రంలో ఒక ఓడ లంగరు వేసి ఆగినట్టు కనబడింది. క్రూసో దానిని జాగ్రత్తగా దూరదర్శినితో పరిశీలించాడు. అది ఇంగ్లండ్ దేశానికి చెందిన ఓడ. దాన్ని చూసి ఎంతగానో సంతోషించాడు. ఆ ఓడ తన ద్వీపానికి చేరువగా ఎందుకు ఆగిందా అని ఎంత ఆలోచించినా తగిన కారణం అతనికి ఏదీ కనిపించలేదు. ఇంతలో ఆ ఓడ నుంచి ఒక పడవ తన ద్వీపం వైపు వస్తున్నట్టు కనబడింది. దాంతో అతనికి సంతోషం పోయింది. ఏదో అపాయం వచ్చేటట్టు అతనికి అనిపించింది, అందువల్ల అతడు చెట్టుచాటు నుంచి పరిశీలించడం ప్రారంభించాడు.

కొంతసేపటికి ఆ పడవ తీరం చేరింది. ఆ పడవలో మొత్తం పదకొండుమంది ఉన్నారు. వారంతా ఇంగ్లండ్ దేశస్థులని అతడు సులువుగా గ్రహించాడు.

తాళ్ళతో బంధింపబడిన ముగ్గురు వ్యక్తుల్ని మిగతా ఎనమండుగురు ఒడ్డున పడవేశారు. ఆ బంధితులు తక్కిన వారిని ఏదో ప్రాధేయపడుతున్నట్టు క్రూసో గ్రహించాడు.

ఫ్రైడే ఎప్పుడు వచ్చేడోగాని క్రూసో వెనుక నిలబడి "మాష్టర్ ! మా వాళ్ళ లాగే మీ తెల్లవారు కూడా మనుష్యుల్ని చంపి తింటారనుకొంటాను." అన్నాడు. ఆ మాటకు క్రూసోకు కోపం వచ్చి, "లేదు; అలా తినరు; మా ఇంగ్లీషు వారు

నరమాంసభక్షకులు కారు. మనుష్యుల్ని వారు ఏ కారణం చేతనైనా చంపితే చంపవచ్చును కాని నరమాంసం తినరు. ఇంకెప్పుడూ మా దేశస్థుల గురించి ఆలా మాట్లాడకు." అన్నాడు.

ఇంతలో ఆ నావికులలో ఒకడు ఒక బంధితుని మీదకు కత్తి ఎత్తాడు. ఆ బంధితుడు తనను రక్షించమని ప్రాధేయపడుతున్నట్టు సలాం చేశాడు. ఆ నావికుడు ఎత్తిన కత్తిని దించి ఇతర నావికులతో కలసి ద్వీపం మీదకు నడచు కొంటూ వెళ్ళిపోయాడు. బంధితులు తీరం మీద ఇసుకలో పడి ఉన్నారు. ఇదంతా గమ్నిస్తున్న క్రూసోకు అసలు విషయం అంతుపట్టలేదు.

## అధ్యాయము - 13

ఆ ఎనమండుగురు నావికులు అడవిలోనికి వెళ్ళారు. వారు కనుమరుగైన తరవాత క్రూసో బంధితులున్న చోటుకు వెళ్ళాడు. ఫ్రైడే అతన్ని అనుసరించాడు. వారిద్దరివద్ద ఆయుధాలు ఉన్నాయి. క్రూసో ఆ బంధితులకు చేరువగా వెళ్ళి "ఎవరండీ మీరు ?" అని స్పానిష్ భాషలో అడిగాడు.

నివాస యోగ్యం కాని ఒక నిర్మానుష్య ద్వీపం అని ఆ బంధితులు ఊహిస్తున్నచోట గొర్రెతోళ్ళ దుస్తులలో ఒక వ్యక్తి వచ్చిన తమను పలకరించడంతో వారు ఆశ్చర్య పోయారు.

"నన్ను చూసి మీరు ఆశ్చర్యపోకండి. నేను అడవి మనిషిని కాను. నే నొక ఇంగ్లీషు వాడిని. మీరు ఆశించకపోయినా మీకు ఇక్కడ ఒక స్నేహితుడు ఉన్నాడని అనుకొనండి. ఇక మీదట మనమంతా స్నేహితులుగా ఉందాం. మీకు కావలసిన సహాయం చేయడానికే మేమిద్దరం వచ్చాం." అన్నాడు క్రూసో స్నేహపూర్వకంగా.

"దేవుడే తన దూతను మీ రూపంలో మాకు సహాయం చేయడానికి

పంపించాడని భావిస్తున్నాం. మే మొక పెద్ద ఆపదలో చిక్కుకొన్నాం. మీరే మమ్మల్ని రక్షించాలి." అని ఆ ముగ్గురిలో ఒకడు ఇంగ్లీషులో అన్నాడు.

"మీరేం భయపడకండి. నేనూ ఇంగ్లీషు వాడినే. నా తోటి దేశస్థులను ఆదుకొనడం కన్నా నాకింకేం కావాలి ? అది నా ధర్మం. మీకు తప్పక షాయం చేస్తాను. ఇతడు నా బానిస. ఇతని పేరు ఫ్రైడే. ఒకప్పుడు ఇతన్ని కూడా ఆపద నుండి రక్షించాను. ఇతడు నా నమ్మిన బంటు. ఇక చెప్పండి మీకు ఏ సహాయం కావాల్ఫ్" అని క్రూసో ఇంగ్లీషులో మాట్లాడి వారికి ధైర్యం కలుగ జేశాడు.

"ఆ కనబడుతున్న ఓడకు నేను కెప్టేన్ను. మేము సముద్రయానం చేస్తూ ఉండగా నా నావికులలో కొందరు నాకు ఎదురు తిరిగారు. నన్ను చంపి నా ఓడను తమ స్వాధీనం చేసికొనాలని వారు ఎత్తు వేశారు. వీరిద్దరూ విశ్వసపాత్రులైన నా స్నేహితులు. కనుక వీరు వారితో కలియలేదు. అందువల్ల వీరిద్దరూకూడా వారికి శాతృవులైనారు. మిగతా నావికులందరూ నా ఓడను స్వాధీనపరచుకొనడానికి ఏకమైనారు. కాని మమ్మల్ని చంపడానికి వారిలో చాలామంది వ్యతిరేకించారు. ఈ విషయమై వారిలొ వారికి తర్జన భర్జనలు జరిగాయి. తుదకు మమ్మల్ని ఈ ద్వీపం మీద వదలి పోవాలని వారు నిర్ణయించుకొన్నారు. ఇక్కడ మాకు తినడానికి తిండి, తాగడానికి నీరూ లేక మాడిమాడి త్వరలో చావాలని వారి ఉద్దేశ్యం" అంటూ తన విషాదగాధను ఆ ఓడ కెప్టెన్ క్రూసోకు తెలియజేశాడు.

"సరే; వారి ఉద్దేశాన్ని నేను తారుమారు చెస్తాను. వారంతా పడుకొన్నట్టు ఉన్నారు. వారికి శాశ్వతమైన నిద్రను ప్రసాదిస్తాను. కాని మీరు నాకొక వాగ్దానం చేయాలి"

"అదేమిటో చెప్పండి. ప్రమాణపూర్తిగా మీరు ఏం చేయమంటే అది చేస్తాం"

అన్నాడు ఓడ కెప్టెన్.

"మా యెడల సద్భావంతో, స్నేహంతో..."

"ఓ తప్పకుండా ఉంటాం" అంటూ ఆ ముగ్గురూ క్రూసో చెప్పినట్టు ఉండడానికి ప్రమాణం చేశారు.

"స్నేహితులారా ! ఇక చూడండి మీ ఓడను మీకు మళ్ళా స్వాధీనం చేస్తాను. ఆ తర్వాత నన్నూ నా నౌకరునూ ఏ సుంకం లేకుండా మీ ఓడలో లండన్ తీసికొని వెళ్ళాలి."

"ఎంతో సంతొషంతో మిమ్మల్ని తీసికొని వెళ్తాం. మాకు అంతకన్నా కావలసింది ఏముంది ?" అన్నాడు ఆ కెప్టెన్.

వెంటనే క్రూసో వారి ముగ్గురి బంధనాలను కోసి వారిని బంధవిముక్తుల్ని చేశాడు. ఆ ముగ్గురికి మూడు తుపాకులు ఇచ్చాడు. ఆ ఐదుగురూ కలిసి నావికులు వెళ్ళిన దిక్కుగా వెళ్ళారు.

"చూడండి !..." అంటూ కెప్టెన్ ఏదో అనబోయాడు.

"నా పేరు రాబిన్సన్ క్రూసో, నన్ను మీరు క్రూసో అని పిలవండి చాలు."

"చూడండి క్రూసో ! ఆ జట్టులోని వారందరూ చెడ్డ వారు కారు. వారిలో కొంతమంది మాత్రం దుర్మార్గులు. వారిని మాత్రం మనం చంపితే చాలు. అందర్నీ చంపితే మన సముద్రయానానికి కావలసినంత మంది మనకు ఉండరు" అన్నాడు కెప్టెన్.

"ముఖ్యుల్ని చంపితే మిగిలిన వారు మనకు లొంగక మానరు" అన్నాడు క్రూసో.

అడవికి చేరువగా వెళ్ళగానే మాట్లాడవద్దని, మెల్లగా చప్పుడు చేయకుండా నడవమని అందర్నీ క్రూసో హెచ్చరించాడు. ఆ ఐదుగురూ జాగ్రత్తగా అడవిలోనికి ప్రవేశించారు. చెట్లనీడను నావికులు నిద్ర పోతున్నారు.

ఆ జట్టు నాయకులలో ముఖ్యుణ్ణి గురి చూసి ఓడ కెప్టెన్ తన తుపాకీ పేల్చాడు, అతని స్నేహితులలో ఒకడు ఇంకొక ముఖ్యుణ్ణి గురి చూసి తుపాకీ పేల్చాడు. వారిలొ ఒకడు చని పోయాడు. రెండవవాడు గాయపడి మూలిగాడు. తుపాకుల ప్రేలుళ్ళకు నిద్రపోతున్న వారందరూ లేచి పరిస్థితి అర్ధం కాక బొమ్మల్లాగ నిలబడ్డారు. వారిని ఉద్దేశిస్తూ ఓడ కెప్టెన్ "మీరు మాతో యుద్ధం చేయలేరు. మీ నాయకులలో ఒకడు మరణించాడు. రెండోవాడు చావుకు సిద్ధంగా ఉన్నాడు. ఇక చెప్పండి మీరు మాకు లొంగిపోయి మా ఆజ్ఞలను పాటిస్తారా ? లేక మా తుపాకులకు బలి కాదలచుకొన్నారా ? మీరు మాకు లోబడి ఉంటామని మాట యిస్తే మీకు ఏ హానీ కలుగదు. లేకపోతే మీకు చావు తప్పదు." అంటూ గట్టిగా హెచ్చరించాడు. దాంతో మిగిలిన ఆరుగురూ చేతులు ఎత్తి నిలబడ్డారు.

"క్రూసో ! వీరిలో ఇద్దర్ని నమ్మడానికి వీలు లేదు. కనుక ఆ యిద్దర్నీ తాళ్ళతో బంధించడం మంచిది" అని ఓడ కెప్టెన్ క్రూసో చెవిలో రహస్యంగా చెప్పాడు.

క్రూసో ఆజ్ఞను అనుసరించి ఫ్రైడే కెప్టెన్ చూపించిన ఇద్దర్నీ బంధించాడు. మిగిలిన నలుగురూ కెప్టెన్ కు క్షమాపణ చెప్పుకొని, ఇకమీదట ఆయనకు విధేయులుగా ఉండడానికి అంగీకరించారు.

ఇంతలో ఓడపైనుండి తుపాకీ శబ్దం వినవచ్చింది. ద్వీపం మీదకు వచ్చిన వారిని తిరిగి రమ్మనమని సాంకేతికంగా ఓడ మీది వారు తుపాకీ పేల్చారు. ద్వీపంనుండి పడవ ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో ఓడమీదివారు ఉండుండి

సాంకేతికంగా తుపాకుల్ని చాలా సార్లు పేల్చారు. కాని ఫలితం కనబడకపోవడంతో మరో పదిమంది నావికులు మరొక పడవ మీద ద్వీపం వైపు బయలు దేరడం క్రూసో దూరదర్శినితో గమనించాడు. ఆ విషయం కెప్టెన్ కు తెలియజేశాడు.

"ఆ పడవలో వస్తున్న పదిమందితో మనం యుద్ధం చెయవలసి వస్తే వారిలో నలుగుర్ని మనం చంపకూడదు. ఆ నలుగురూ స్వతహాగా మంచివారె. కాని ఒత్తిడివల్ల వారు నా శత్రువులతో చేరక తప్పలేదు," అని కెప్టెన్ క్రూసో తో అన్నాడు.

"అలాగే కెప్టెన్ ! ఆ పడవ తీరానికి చేరువగా వస్తున్నది కనుక మనం పొదల చాటున వాఆరికి కనబడకుండా దాగొనాలి. పదండి !" అంటూ కెప్టెన్ను, మిగతా వారిని మూడ క్రూసో హెచ్చరించాడు.

అందరూ పరుగు పరుగున వెళ్ళి పొదలమాటున నక్కి కూర్చున్నారు. ఇంతలో పడవ తీరం చేరింది. అందులోనుండి ముగ్గురు తప్ప అందరూ తీరం మిదకు గెంతారు. వారి మిత్రుల కోసం చుట్టూ కలియ జూశారు. ఎవరూ కనబడ లేదు. వారు గొంతెత్తి బిగ్గరగా పేరు పేరునా పిల్చారు. కాని ఎటువంటి సమాధానం వారికి రాలేదు. అందువల్ల వారు తమ స్నేహితులను వెతకడానికి బయలు దేరారు. పడవలోనివారు తీరం వెంబడి పడవను నడిపించుకొంటూ బయలుదేరారు.

కొత్తగా వచ్చిన వారిని అడవిలోనికి దూరంగా తీసికొని వెళ్ళడానికి క్రూసో ఒక ఉపాయం ఆలోచించాడు. ఫ్రైడేని, కొత్త స్నేహితులలో ఒకణ్ణి పిలిచి, "మీరిద్దరూ అడవిలోనికి దూరంగా వెళ్ళి శత్రువుల పిలుపులకు సమాధానంగా గట్టిగా పలకండి. ఆ విధంగా వారిని అడవిలోనికి తీసికొని పొండి" అని వారితో చెప్పి పంపించాడు. అతడూ ఓడ కెప్టెనూ పొదల చాటున నక్కి కూర్చుని అంతా గమనించసాగారు.

ఫ్రైడేతో వెళ్ళిన నావికుడు అడవిలోనికి దూరంగా వెళ్ళి కొత్తగా వచ్చిన వారిని

పేరుపెట్టి పిలవసాగాడు. కొత్తగా వచ్చిన వారు ఆ పిలుపులకు సమాధానంగా కేకలు వేస్తూ అటు వెళ్ళ సాగారు. తర్వాత వారికి ఇంకొక దిశ నుండి పిలుపులు వినబడ్డయి. వెంటనే వారు అటు మళ్ళారు. ఈ విధంగా వారు అడవిలోనికి దూరంగా వెళ్ళారు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. అడవిలో చీకటి అలుముకొనజొచ్చింది. తిరిగి తిరిగి అలిసిపోయి ఆ కొత్తవారు నిరాశతో తీరంవైపు తిరుగు ముఖం పట్టారు.

క్రూసోతొ గూడా ఓడ కెప్టెన్ వారికోసం దారి కాశాడు. వారు దగ్గరకు రాగానే కెప్టెన్ వారిపైకి తుపాకీ పేల్చాడు. తను ఉద్దేశించిన ఇద్దరూ నేలకూలేరు. అందులో ఒకడు చనిపోయాడు, రెండవవాడు గాయపడ్డాడు. అదే సమయంలో ఫ్రైడే వెనుకనుండి గాలిలోనికి తుపాకీని పేల్చాడు. నడుమనున్న శతృవులు భయపడి, చేసేది ఏమిలేక చేతులు ఎత్తి క్రూసోకు లొంగి పోయారు. ఫ్రైడే వారిని తాళ్ళతో బంధించాడు. ఇంతలో బాగా చీకటి పడింది.

## అధ్యాయము - 14

ఆ మర్నాడు ఖైదీల నందర్నీ ఓడ కెప్టెన్ విజయ గర్వంతొ పలకరించి "మీరంతా దుర్మార్గులు, విశ్వాసఘాతకులు, స్వామిద్రోహులు. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టే దుర్బుద్ధి గలవారు మీరు. నన్నూ నా స్నేహితుల్నీ ఈ ద్వీపం మీద వదిలిపెట్టి నా ఓడను స్వాధీనం చేసికొనాలనుకొన్నారు. ఇక్కడ తిండి లేక మేము చనిపోతామని మీరు భావించారు. కాని తానొకటి తలిస్తే దైవ మొకటి నిర్ణయించాడు.

"ఈ ద్వీపానికి గవర్నరు ఒకరు ఉన్నారు. ఆయన పేరు రాబిన్సన్ క్రూసో. ఇప్పుడు మీరంతా ఆయనకు ఖైదీలుగా చిక్కారు. మిమ్మల్ని ఆయన ఇంగ్లండ్ పంపించి, మీ తిరుగుబాటు చర్యను చట్టరీత్యా విచారించవలసిందని ప్రభుత్వాన్ని

కోరదలచారు. బ్రిటిష్ ప్రభుత్వం మీకు తగిన శిక్ష విధిస్తుంది."

"మన గవర్నరుగారికి ఓడలో జరిగినదంతా వివరంగా విన్నవించుకొన్నాను. ఈ కుట్రకు నాయకుడైన అట్కిన్సును ఇక్కడే వారు విచారించి శిక్షించ దలచుకొన్నారు. మిగతా వారిని విచారణ నిమిత్తమై ఇంగ్లండ్ పంపించదలచుకొన్నారు" అంటూ ఓడ కెప్టెన్ వారికి చెప్పాడు.

ఇంతలో రాబిన్సన్ క్రూసో కొత్త దుస్తులు ధరించి గవర్నరులాగ ఠీవిగా వారి ముందుకు వచ్చి " మీరంతా స్వామిద్రోహులు, న్యాయంగా మిమ్మల్ని అందర్నీ ఉరి తీయాలి. కాని మీరంతా కుట్ర నాయకుడైన అట్కిన్సు మాటలకు మోసపోయి మీ కెప్టెన్ కు ఎదురు తిరిగినట్టు నాకు తెలిసింది. కనుక మీరు మీ కెప్టెన్ కు క్షమాపణ చెప్పుకొంటే మిమ్మల్ని క్షమించగలను. అట్కిన్సుకు ఉరిశిక్ష విధిస్తున్నాను," అని చెప్పాడు.

ఆ కుట్ర దారులందరూ క్రూసో కాళ్ళ మీద పడి క్షమాభిక్ష వేడికొన్నారు. కాని క్రూసో మాట్లాడాకుండా ఠీవిగా కెప్టెన్ తో సహా వెళ్ళిపోయాడు.

క్రూసో తో కెప్టెన్ సమాలోచనలు జరిపి తుదకు కుట్ర దారులలో దుర్మార్గులను ఒక జట్టు కిందా, మిగిలిన వారిని ఒక జట్టు కిందా విభజించాడు. దుర్మార్గుల కాళ్ళూ చేతులూ కట్టి వేసి వారిని కొండగుహలో పడవేయమని, ఇతరులను 'వన విహార్ ' లో ఉంచమని క్రూసో ఫ్రైడేని ఆజ్ఞాపించాడు. కెప్టెన్ తన స్నేహితులైన వారిని ఆ కుట్ర దారులకు కాపలా కాయమని నియమించాడు. తర్వాత ఓడను ఎలా స్వాధీనం చేసికొనాలన్న విషయమై క్రూసోతొ కెప్టెన్ చాలాసేపు చర్చించి క్రూసో సలహాలను పాటించడానికి కెప్టెన్ అంగీకరించాడు.

వెంటనే కెప్టెన్ కుట్రదారుల వద్దకు వెళ్ళి, "గవర్నరు గారు మీ విషయమై

మూడు సూచనలు చేశారు. ఒకటి, స్వేచ్ఛా జీవులుగా మీరు ఈ ద్వీపం మీద ఆజన్మాంతం ఉండడం. లేక రెండు, ఇంగ్లండ్ వెళ్ళిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించడం, లేక మూడు, వారికి విధేయులుగా ఉండి ఓడని స్వాధీన పరచుకొనడంలో వారికి సహాయపడి ఏ శిక్షా లేకుండా హాయిగా స్వదేశం చేరుకొవడం. ఈ మూడింటిలో ఎవరికి ఏది కావాలో కోరుకొనండి" అని చెప్పాడు.

ఓడను తిరిగి కెప్టెన్ కు స్వాధీన పరచడానికి తగిన సహాయం చేయడమే కాక బ్రతికి ఉన్నంత కాలం క్రూసోకే కాక కెప్టెన్ కు కూడా విధేయులుగా ఉండడానికి వారు అంగీకరించారు.

తర్వాత నమ్మకస్తులైన పన్నెండు మంది నావికులను ఓడ కెప్టెన్ ఎంచుకొని, ఓడను స్వాధీన పరచుకొనడానికి బయలు దేరాడు. వారంతా కలిసి ఓడలోనున్న కుట్రదారులలోని మరొక నాయకుణ్ణి తుపాకీతో కాల్చి చంపి, ఇతరులను వశపరచుకొన్నారు. వెంటనే వారు ఏడుసార్లు తుపాకులను గాలిలో పేల్చారు. ఆ సాంకేతికాలను విని ఇంటికి వెళ్ళి క్రూసో హాయిగా నిద్రపోయాడు.

ఆ మర్నాడు ఉదయం క్రూసో నిద్ర లేచిన తర్వాత కెప్టెన్ వచ్చి దూరాన్న సముద్రంలో నిలిచి ఉన్న ఓడను విధేయతతో చూపిస్తూ "గవర్నరు గారూ ! ఆ ఓడ నాది కాదు మీది. ఆ ఓడకు చెందిన మేము, మీ అధీనుల మవుతున్నాము. మీ ఆజ్ఞలను శిరసావహించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాము. ఆజ్ఞాపించండి" అంటూ మోకాళ్ళ పైని కూర్చున్నాడు. రాబిన్సన్ క్రూసో ఆ ఓడను తదేకంగా చూస్తూ కొయ్యలా నిలబడి పోయాడు. అతని మనస్సులోని సంతోషం అతన్ని నిశ్చేష్టుణ్ణి చేసింది. ఆ ద్వీపంనుండి ఎలాగైనా బయటపడి తన స్వదేశం చేరుకొనాలనే తలంపు చాలా కాలంగా అతనికి ఉంది. కాని ఇంత త్వరలో ఆ ఆశ నెరవేరుతుందని అతడు కలలోగూడా ఊహించలేదు. అందువల్ల అతని

ఆనందానికి అంతు లేక పోయింది. అతని కళ్ళ వెంట ఆనంద భాష్పాలు రాలేయి. శరీరం అతని స్వాధీనం తప్పింది. అతను ఎక్కడ ఉన్నదీ అతనికే తెలియలేదు. ఆ అనందంలో అతడు నేలకు ఒరిగిపోతూ ఉంటే కెప్టెన్ అతన్ని పట్టుకొని పడుకో బెట్టాడు. తర్వాత అతనికి కాస్త ద్రాక్ష సారాని కెప్టెన్ ఇచ్చాడు. ద్రాక్షసారా తాగి, కాస్త ఆహారం తిసికొని కెప్టెన్ ఇచ్చిన చుట్టను కాలుస్తూ ఉంటే క్రూసో మనోభావాలు ఎన్నో సంవత్సరాల వెనక్కు వెళ్ళాయి.

"గవర్నర్ గారూ ! మేము ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి" అన్నాడు కెప్టెన్.

"నా సంతోషం నుండి నన్ను తేరుకోననీయండి. ఈ ఒక్క రాత్రి నన్ను నా ద్వీపం మీద గడపనీయండి" అన్నాడు క్రూసో.

"తమ ఇష్ట ప్రకారమే కానీయండి. మరి మన ఖైదీల విషయమై మీ నిర్ణయం తెలియజేయండి."

"ఓడ మీద నిన్న మీరు చంపిన ఆ నాయకుని శవాన్ని ఇక్కడకు తెప్పించి ఒక చెట్టుకు వ్రేలాడకట్టండి. ఆ శవాన్ని చూసి ఇతర కుట్రదారులు ఒక గుణపాఠం నేర్చుకొంటారు. ఆ తర్వాత వారి విషయమై ఆలోచిద్దాం."

"మీ సామానులలో వేటిని ఓడలోకి ఎక్కించమంటారో సెలవియ్యండి. ఆ పనైనా ఈ లోపున పూర్తి చేస్తాం."

"అయితే ఓడను తీరానికి చేరువుగా తిసికొనిరండి."

ఆ సాయంత్రం గవర్నర్ రాబిన్సన్ క్రూసో తన దర్బారులో కూర్చున్నాడు. అతని కుడి ప్రక్కను కెప్టెన్ ఆశీనుడైనాడు. వారి వెనుక వారి అనుచరులు, వారికి ఎదురుగా ఖైదీలను నిల బెట్టారు. వారికి ఎదురుగా దూరంగా ఒక చెట్టుకు కుట్రదారుల నాయకుని కళేబరం వ్రేళ్ళాడుతూ ఉంది.

మీ నాయకుని శవాన్ని మీరంతా ఒకసారి చూడండి. మీలో ఎవరైనా ఓడ మీదకు రా ప్రయత్నించారా మీకూ అదే గతి పడుతుంది. జాగ్రత్త. ఇక్కడ నేను సమకూర్చుకొన్న ఆస్తినంతా మీకు వదిలి పెడుతున్నాను. ఈ ద్వీపం మీద నాకు రెండు ఇళ్ళు ఉన్నయి. వాటిలో మీరు హాయిగా నివసించవచ్చును. నాకు మూడు గొర్రెల మందలు ఉన్నయి. వాటి పాడిని మీరు అనుభవించండి. నేను మూడు మళ్ళను సాగు చేసి గోధుమలను, జొన్నలను పండించాను. మీరు మరి కొన్ని మళ్ళను సాగు చేసి వ్యవసాయం వృద్ధి చేసికొనండి. నేను రెండు తుపాకులను మాత్రమే తీసికొని వెళ్తున్నాను. ఇవాళో రేపో పదహారు మంది స్పానిష్ దేసస్థులు ఇక్కడికి వస్తాఆరు. వారి కోసం త్వరలో ఒక ఓడను పంపించగలనని వారికి చెప్పండి. దేవుడు చాలా దయగలవాడు. నన్ను ఆ దైవం రక్షించాడు. అడవి మనుష్యుల బారి నుండి ఆ భగవంతుడే నన్ను రక్షించాడు. ఇన్ని సంవత్సరాలు ఏ అపాయం రాకుండా ఆ దయామయుడే నన్ను కాపాడాడు. మీరంతా కలిసి మెలిసి ఈ ద్వీపం మీద బ్రతకండి. మీరు పశ్చాత్తాపం పడితే దేవుడు మీకు తప్పక మేలు చేస్తాడు" అని క్రూసో ఆ కుట్రదారులకు హితోపదేశం చేశాడు.

ఆ మర్నాటి ఉదయమే క్రూసో తన బొచ్చు టోపీనీ, తోలు దుస్తులను, వింత గొడుగుని ఓడలోనికి పంపించాడు. తన రామచిలుకను భుజం మీద ఎక్కించుకొని, దాని పలుకులను సరదాగా వింటూ ఓడ ఎక్కాడు.

ఓడ లంగరు ఎత్తి నీటిలో కదిలి పోతుంటే క్రూసో ద్వీపం వైపు తదేకంగా చూస్తూ ఉంటే తన కొయ్య కాలెండరు కనబడింది. అతని ఇరవై ఏడేళ్ళ ద్వీపాంతర వాసం అతని కళ్ళకు కట్టింది. ఒకసారి తన కుక్కను తల్చుకొన్నాడు. మనస్సులోనే క్రూసో దేవునికి కృతజ్ఞతలు తెల్పుకొంటూ ఉండగా ఓడలో ఏదో అలజడి వినబడింది. ఎవరో ఇద్దరు ఖైదీలు తమని కూడా ఓడ ఎక్కించమని కెప్టెన్ ను

ప్రార్థిస్తున్నారు. కెప్టెన్ నిరాకరిస్తున్నాడు. అప్పుడు క్రూసో దయదలచి, ఆ ఇద్దర్నీ కూడా ఓడ ఎక్కనిచ్చాడు.

1687 జూన్ 11 వ తేదీన ఇంగ్లండ్ దేశ కొండ శిఖరాలు దూరంగా రాబిన్సన్ క్రూసో కు కనబడ్డాయి. ముప్ఫై అయిదు సంవత్సరాల అనంతరం తన మాతృదేశం తన కళ్ళకు కంపడినందుకు క్రూసో మనస్సు ఆనందంతో చిందులు వేసింది. అతడు తలవంచుకొని, కళ్ళు మూసికొని మనస్సులో దేవుణ్ణి ప్రార్థిస్తూ మోకాళ్ళ పైని కూర్చున్నాడు.

ఓడ ఇంగ్లండ్ దేశ తీరం వైపు సాగి పోతూంది.

సమాప్తం